చెన్నపురి ఆయుర్వేదకలాశాల.

ఆయుర్వేదమును లక్ష్యలక్షణములతోడను పాశ్చాత్య వైద్యమందలి అనాటమీ ఫిజియాలజీ మొదలగు వానితోడను గరపబడును.

ఇందు "ఆయుర్వేదభూషణ" అను సంస్కృతశాఖయు "భిషగ్వర" అను ఆన్ధ్రశాఖయును రెండుశాఖలు గలవు.

సంస్కృతశాఖకు నాటకాంత సంస్కృతజ్ఞానము గలవారుగ నుండవలెను.

ఆన్ధ్రశాఖకు తెనుగున మంచి భాషాజ్ఞానము గలిగి యుండవలెను.

విద్యార్థులు 16 వత్సరములకు తగ్గకను 24 వత్సరములకు మించనివారుగ నుండవలయును.

కలాశాలయందు చేరగోరువారు అక్టోబరు మాసాంతమునకు దరఖాస్తులను బంపుకొనవలెను.

వివరములు గోరువారు కలాశాలాధ్యక్షులకు వ్రాసిన దెలుసుకొనవచ్చును.

ఆయుర్వేదకలాశాల,
మదరాస్.

వైద్యరత్న పండిత. డి. గోపాలాచార్లు,
ఎ. వి. యస్., ఎ. యం. బి.
ప్రిన్సిపాల్.

ఆయుర్వేదాశ్రమ గ్రంథమాల—౧౩.

దక్షిణభారతము-ఆయుర్వేదప్రచారము.

ఆయుర్వేదాశ్రమ గ్రంథమాల—౧౩.

దక్షిణభారతము-ఆయుర్వేదప్రచారము.

ఇది

చెన్నపురి ఆయుర్వేదకళాశాల ప్రిన్సిపాలును

అఖిలభారతాయుర్వేద విద్యాపీఠమున కధ్యక్షులును నగు

శ్రీమాన్,

వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులు,

ఆయుర్వేదమార్తాండ భిషఙ్మణి, ఏ. వి. యస్., వారిచే

అఖిలభారతాష్టమాయుర్వేద మహాసమ్మేళనమున

పూనాలో (26-2-17) నొసగబడిన

యుపభాషణము.

చెన్నపురి :

౧౯౧౭ సం॥

రిజిస్టర్డు - కాపిరైటు.

చెన్నపురి :

55, ఆచారప్పన్ వీధియందుగల

వైద్యరత్న, పండిత డి. గోపాలాచార్యులవారి

స్వకీయాయుర్వేద ముద్రాయంత్రమున ముద్రింపబడి

ఆయుర్వేదాశ్రమమున ప్రకటింపంబడియె.

పీఠిక.

పూనానగరమునందు గడచిన ఫిబ్రవరిమాసమున శ్రీ శ్రీ కొచ్చిమహారాజాగారి యాధిపత్యముక్రింద నడిచిన యఖిలభారతాష్టమాయుర్వేద వైద్య మహాసమ్మేళనమున స్వాగతకారిణీసభవారు వైద్యరత్న పండిత, డి. గోపాలాచార్యులవారిని దక్షిణభారతమందలి యాయుర్వేదప్రచారముంగూర్చి విపులమగు నొకవ్యాసలేఖను సిద్ధము జేయఁగోరిన శ్రీఆచార్యులవారు అట్టివిషయములను విమర్శించి గీర్వాణవాణియందు వ్రాసి పై మహాసమ్మేళనమున (26-2-17) జదివిరి.

ఈవ్యాసము సభానాథులగు శ్రీకొచ్చిమహారాజులవార్లయొక్కయు సమ్మేళనమువారియొక్కయు స్వాగతకారిణీసభవారియొక్కయు శ్లాఘనకు బడసినది. దక్షిణభారతమునంగల యాయుర్వేదవ్యాప్తి దెలియనివారల కందరికిని ఈవ్యాసమునురచించి యాచార్యులవారు మార్గదర్శకులైనందుకు మనమందరము కృతజ్ఞులుగా నుండవలెనని శ్రీసభానాయకులు నుడివిరి. పిదప ప్రత్యక్షశారీరాది గ్రంథరచనాధురీణులును అంగ్ల ఆయుర్వేదవైద్యాచార్యులును మహామహోపాధ్యాయ, విద్యానిధి, సరస్వతి, ఆయుర్వేదావతంసేత్యాది బిరుదావళీవిరాజమానులునునగు కవిరాజ గణనాథసేన్ ఎమ్. ఎ. ఎల్. ఎమ్. అండు ఎస్., గార్లు సభానాథునియొక్క యనుజ్ఞ ననుసరించి శ్రీగోపాలాచార్యులవారికి అభినందనములజేయుచు నిట్లు నుడివిరి:—

«శ్రీగోపాలాచార్యులువారు చిరకాలమునుండియు నాయుర్వేదమునకై జేయు సేవ లోకవిదితము. వారి సర్వస్వమును ఆయుర్వేదమునకై వినియోగించుచున్నారు. వారిచే నెలకొల్పబడిన యాయుర్వేదకళాశాల లోకోత్తరమైనది. దక్షిణభారతమున నాయుర్వేదమును చక్కనిపునాదితో ప్రచారమునకు దెచ్చినదియేగాక చరకాదిగ్రంథముల నాంధ్రమున పరివర్తించి ప్రచారము జేయుచున్నారు. వీరివద్దయొక దక్షిణభారతమువారలేగాక పంజాబు, బెంగాలు, ఘూర్జరము మొదలగు దేశముల నుండువారలుకూడ విద్యనభ్యసించి వ్యాపకులుగనున్నారు. వీరికి ఆయుర్వేదమున పాండితి యుండుటయేగాక ఆయుర్వేదైతిహాసికవిషయములయందును పరిశ్రమమధికము. ఆయుర్వేదవాఙ్మయమును గూర్చిన చరిత్రము నొకటిని నేను వ్రాసియున్నాడను కాని శ్రీఆచార్యులవారి యభిభాషణమున గనపరచిన వివిధవైద్యగ్రంథముల నామములనుసైతము నేనెన్న

డును వినియుండలేదు. అపూర్వమగు వీరి పరిశోధన మాయుర్వేదమహాసమ్మేళనమునకు చాల మేలు గలిగించును. వీరియుపన్యాసములయందు అష్టస్థానపరీక్షనాడీపరీక్షలచేచేయు రుగ్వినిశ్చయమార్గమును చరకాదిచక్రదత్తుల కాలము వరకును నెవరును సంస్కృతవైద్యగ్రంథకర్తలు వ్రాసియుండలేదనియు, 14 శతాబ్దమునకు వెనుకటివారగు శార్ఙ్గధరాదులు నాడీపరీక్షాదుల వివరించిరనియు, ఆనాడీపరీక్షాదులను వీరికి పూర్వమునందే యగస్త్యవైద్యసంప్రదాయమువారు ద్రవిడభాషయందు వ్రాసియున్నారనియును, దీని పౌర్వాపర్యమునుగూర్చి విమర్శించుట యావశ్యకమనియు వ్రాసియున్నారు. ఇది యొక గొప్పవిషయము. ఈవిషయమై యాచార్యులవారు వంద్యులు. దక్షిణభారతాయుర్వేదచరిత్రమును వాఙ్మయమును వైద్యవ్యాపనమునుగూర్చి వారు మనకుపదేశించిన విషయములన్నియు నిదివరకెరింగియుండలేదు. ఇట్టి యాయుర్వేదమునకు జేరిన యపూర్వవిషయములను మనకుబోధించిన శ్రీఆచార్యులవారికి సభాసదులగు మీయందరిపక్షమునను శ్రీసభానాయకుల యాజ్ఞనుండి నామనఃపూర్వకమగు నభినందనముల నందజేయుచున్నాడ" నని సెలవిచ్చిరి. మరియు శ్రీగణనాథసేన్‌గారు ఈవ్యాసమును నాగరాక్షరముల ముద్రించి వైద్యులందరికి నందజేయవలెనని కోరిరి. సమ్మేళనమును పరిసమాప్తిని జేయుసమయమున సభానాయకులగు శ్రీకొచ్చిమహారాజులవారు ప్రత్యేకముగ శ్రీ ఆచార్యులవారి యభిభాషణము లోకోత్తరమైనదనియు, ఆయుర్వేదవైద్యులు వైద్యముపట్ల విమర్శనముల జేయుటకు మార్గదర్శకమైనదియనియు గొనియాడుచు నీవ్యాసమును సంస్కృతభాషయందేగాక దేశభాషాసామాన్యమునగూడ ముద్రించి వైద్యలోకమునకు ప్రచారము జేయుట యావశ్యకమనియు నుడివిరి. ఈవ్యాసము ననేకులు కోరియుండుటచేతను సభానాయకులగు శ్రీకొచ్చిమహారాజుల వారియొక్కయు శ్రీగణనాథసేన్‌గారియొక్కయు కోరికలననుసరించియు సంస్కృతభాషలోనుండిన యీవ్యాసమును ముందుగ మాపాఠకమహాశయులకై యాంధ్రభాషయందు ముద్రించినారము. ప్రకృతము కాగితములు మొదలగు ముద్రణద్రవ్యముల వెలలు ముందుకన్న మూడునాలుగుభాగము లధికమైనను గణింపక పాఠకమహాశయులకై గ్రంథప్రచారము జేయుచున్నారము. పాఠకమహాశయుల నధికముగ ప్రోత్సాహమును గలుగజేయగోరుచున్నారము.

చెన్నపురి,	కార్యనిర్వాహకులు,
ఆయుర్వేదాశ్రమం.	ఆయుర్వేదగ్రంథమాలా కార్యాలయము.

హెచ్. హెచ్. శ్రీ. సర్. మహారాజ రామవర్మ,

జి. సి. యస్. ఐ., జి. సి. ఐ. ఇ., యఫ్. యం. యు.,

ఇత్యాదిబిరుదావళీవిరాజమానులగు కొచ్చిమహారాజావారి యాధిపత్యమున

(26—2—17 దినమున)

అఖిలభారతాష్టాంగాయుర్వేద వైద్యమహాసమ్మేళనమునందు

వైద్యరత్న పండిత డి. గోపాలాచార్లు,

ఎ. వి. యస్., ఎ. యం. బి. వారిచే నొసగబడిన

యభిభాషణము.

దక్షిణభారతము-ఆయుర్వేదప్రచారము.

సభాధినాథ శ్రీమహారాజమహాశయ !

నియుక్త సోదరీ సోదర వైద్యపుంగవులారా !

దక్షిణభారతమునందలి యాయుర్వేద ప్రచారముం గూర్చి యీ వైద్యమహాసమ్మేళనమున నుపన్యసింప నఖిల భారతాయుర్వేదాష్టాంగవైద్యసమ్మేళనస్వాగతకారిణీ సభవారు నన్ను నియోగింప భాగ్యముం బడసితిని.

ఇట్టి మహాకార్యమును నిర్వహింప జ్ఞానముచేతను వయస్సుచేతను నాకన్న పూజ్యులగు నాయుర్వేదవైద్యవిద్యావిశారదు లనేకులున్నను నాకీయపూర్వమగు గౌరవమును

గలుగ జేసినందుకు స్వాగతకారిణీసభాసదుల కనేక వందన సహస్రములం జేయువాడ.

బహువిషయ విమర్శనలతోఁ గూడిన యీకార్యము నిట్టి మహోత్సాహసమయమున సమగ్రముగ పరికించి నిర్వహింప సమర్థత నాకు లేదనుసంశయము నన్నధికముగ బాధించుచున్నది. అయినను నేను స్వాగతకారిణీసభవారి ప్రీతిపూర్వకమగు కోరికననుసరించి నేను సన్నద్ధుడను గాకున్నచో నేయాయుర్వేదమహాసభ నన్నింతకాలమునుండియు నఖిలభారతాయుర్వేద మహాపరిషదమువలన నేర్పరుపంబడిన “ఆయుర్వేద విద్యాపీఠము” నకు జేరిన బాధ్యతలతోఁ గూడిన కార్యములయందు నియోగించెనో అట్టివిద్యాపీఠపరిషదముపట్ల కృతఘ్నుడగు సేవకునిగ నన్ను భావింతురనుభీతిచే నేనాయుర్వేదప్రపంచమున జేయు కార్యములలో నెల్ల నియ్యది ప్రథమకృత్యమని నిశ్చయించి యెట్టకేల కుపన్యసింప గడంగితిని.

త్రికాలవేదులగు మహర్షిపుంగవుల జ్ఞానజ్యోతితోఁ గూడిన యాయుర్వేద వైద్యవిద్యాపారంగతులగు మీయందరియొక్క యవ్యాజకరుణచే నేకకాలంబున నిందరి పేరోలగంబున ప్రాణసంరక్షణదక్షమగు నీమహోన్నతాయుర్వేద సేవంజేయుచు “దక్షిణభారతాయుర్వేద ప్రచారము” గూర్చి నిర్భయముగ నుపన్యసింప నుద్యమించితిని.

సకలవిధారోగ్యభాగ్యంబు లొసగు నా శ్రీయఃపతిని, రోగార్తులను నిజపుత్రులంబోలి యుపచరించు నా వైద్యసోదరులను నాలోపముల మన్నింప ప్రార్థించుచున్నాడను. ఇట్టి యవకాశమును మీరలు నాకొసంగినందుకు నామనఃపూర్వకములగు వందనశతసహస్రంబుల నొసర్చుచున్నాడను.

—(దక్షిణదేశవిభాగము.)—

దక్షిణభారతమనగ వింధ్యపర్వతమునకు దక్షిణదిశయందుగలదేశమని ప్రసిద్ధము. ప్రకృతోపన్యాసమునకై చెన్నరాజధానిని, దానిని చుట్టుకొనియుండు సింహళద్వీపమును, కేరళమును, కార్నాటకమును, నైజాము హైదరాబాదు రాజ్యమందలి కొంతభాగమును జేర్చి గ్రహించినాడను.

—(ఆయుర్వేదము, దాని ప్రాచీనత.)—

ఆయుర్వేదవైద్యము భారతదేశమున చిరకాలమునుండియు వ్యాపకమైయుండుట లోకవిదితము. అందును దక్షిణభారతమున నాయుర్వేద వైద్యవిద్యావ్యాపనము చిరకాలమునుండి గలదనుటకు పెక్కుదృష్టాంతములుగలవు. ఇయ్యది యితర వైద్యకపద్ధతులకన్నను మిక్కిలి ప్రాచీనమనుట లోకసమ్మతము. ఇప్పటినవీనమార్గముల కనుగొనబడినవనితలచబడు * రక్తచలనము మొదలగు సిద్ధాంతములు చరకాదిగ్రంథముల గలవనుట నవీనము కాదు.

* చరకసూత్రస్థానమున ౩౦-వ అధ్యాయము.

విస్మయజనకముగ నిప్పటివారు చేయు శస్త్రచికిత్సలును తత్సాధనములగు యంత్రశస్త్రములును కొన్ని వేలవత్సరములకు పూర్వమువిరచితములగు చరకసుశ్రుతముల కాలమునాటికే కలవనుటకు సందియము లేదు. నవీనపాశ్చాత్య చికిత్సాపద్ధతులచే ననివార్యములగు ననేకవ్యాధులను గుదుర్చుటలో విఖ్యాతములైన యౌషధగణములతో గూడినదనుట సర్వజనవిదితము. ఇట్టి యనేకవిషయములతో డంగూడిన యాయుర్వేదమహిమను గూర్చి నేను విస్తరించుటయనవసరము.

వైదికమహాయుగమునుండియు ప్రఖ్యాతివడసి బ్రహ్మదక్ష అశ్విని ధన్వంతర్యాది పరంపరలచే నభివృద్ధినిబొంది వేదచోదితమైన ఆయుర్వేదము భారతదేశమున నుత్తరవిద్యాపీఠ దక్షిణవిద్యాపీఠములచే వ్యాపినందినదని ఐతిహాసికులు జెప్పెదరు.

—। చరకవిద్యాపీఠము. ।—

పంజాబుదేశమందలి తక్షశిలయను గ్రామమున క్రీస్తుజన్మమునకు మున్నూరు (300 బి-సి) వత్సరములకు బూర్వమున ఆత్రేయమతానుయాయియగు చరకుడు కాయచికిత్సాప్రధానమైన యష్టాంగవైద్యకవిషయముల ననేకులకు బోధించి వృద్ధిజేసెను. దీనికే చరకవిద్యాపీఠమనిపేరు.

—। సుశ్రుతవిద్యాపీఠము. ।—

వారాణసీనగరమున సుశ్రుతుడు క్రీస్తుజననానంతరము నాలవశతాబ్దమున శస్త్రచికిత్సాపద్ధతుల ననేకులకు

బోధించి శల్యతంత్రమును వ్యాప్తినొందించిరి. ఈ విద్యాస్థానమునకే సుశ్రుతవిద్యాపీఠమని పేరు.

—॥ అగస్త్యవిద్యాపీఠము. ॥—

దక్షిణభారతమున నగస్త్యమహర్షిచే నెలకొల్పబడిన విద్యాపీఠమున కగస్త్యవిద్యాపీఠమని పేరు. ఇయ్యది పై రెండు విద్యాపీఠములవలెనే క్రీస్తవజన్మకు పూర్వమా లేక పరమా యని యిప్పటివరకును చరిత్రకారులచే నిశ్చయింపబడినట్లు కనబడదు. పై బేర్కొనిన చరక సుశ్రుత విద్యాపీఠముల బరంపర భారతధరామండలియందేగాక యనేక ఖండములయందును క్రమముగ నభివృద్ధిగాంచెను. ఆవ్యాప్తికి ఇందలి గ్రంథములన్నియు సంస్కృతభాషామయము లగుటయే ముఖ్యకారణము. అగస్త్యవిద్యాపీఠ పరంపరలు పైవాని వలెగాక దక్షిణాపథమందలి యేకదేశమగు ద్రవిడదేశమున మాత్రము వ్యాప్తిగాంచెను. ఈసంప్రదాయమందలి గ్రంథజాలమంతయు సర్వదేశవ్యాప్తమగు సంస్కృతభాషయందు లేక చెన్నరాజధానియందలి కొందరిచే వాడబడు ద్రవిడభాషలో వ్రాయబడుటయే యిందుకు ముఖ్యకారణమని యూహింపదగియున్నది.

ఈసంప్రదాయమును గురించిన వివరములను 1913-వ వత్సరము ఏప్రిల్ మాసమున బొంబాయినగరమున నఖిలభారతాయుర్వేద వైద్యమహాసమ్మేళనమున నాయధ్యక్షతాభిభాష

ణమున దెలిపియుంటిని. మరియు నాచే బ్రచురింపంబడు నాయుర్వేదాశ్రమ గ్రంథమాలయందు 5-వ గుచ్ఛముగు "అగస్త్య సంప్రదాయము" అను చిన్నపుస్తకమున నీ విషయముల వివరించితిని.

అయినను సభాసదులగు నా ప్రియవైద్య సోదరులకీ సంప్రదాయప్రకారమును దెలుపుట కుత్సాహమును గలిగి యున్నాడ.

—॥ అగస్త్యవిద్యాపీఠము దానిచరిత్ర. ॥—

దశరథరాజతనయుండగు శ్రీరామచంద్రులు దక్షిణాపథయాత్రసలుపుటకు పూర్వమే పూజ్యులైన యగస్త్యమహర్షి దక్షిణాపథము నలంకరించిరనుట లోకవిదితము. ఇయ్యది శ్రీరాములయాగమనమున కెంత కాలమునకుపూర్వమో వ్రాయజాలను. రామరావణయుద్ధమున శ్రీరాముని సర్వసైన్యమునకు చికిత్సకుడుగనుండిన సుషేణుడు ప్రసిద్ధుడు. శక్త్యాయుధాఘాతముచే మూర్ఛనొందిన లక్ష్మణుని సమ్మోహరహితునిగ జేసినవీరి చికిత్సాకుశలత సుప్రసిద్ధము. ఈప్రాంతముల నాయుర్వేదప్రచారమున కిట్టిదృష్టాంతములు పెక్కులు గలవు.

—॥ సంప్రదాయప్రవర్తకులు. ॥—

ఈసంప్రదాయ ప్రవర్తకులు నలువదినలుగు (44) రని కొందరును మరికొందరు యిరువదియిద్దరు (22) రనియు ఇంక కొందరు పదునెనమండ్రుగు(18)రనియువచించెదరు. పైమూడు

మతములలో పదునెనమండ్రుగురను మతమే సర్వజనాంగీకృతము. ఈసంప్రదాయప్రవర్తకుల నందరిని ప్రాయికముగ సిద్ధులని వ్యవహరించుట వాడుకయైయున్నది.

— సంప్రదాయపరంపర. —

ఈసంప్రదాయమును ఈశ్వరుడు పార్వతికిని, పార్వతి నందీశునకును, నందీశుం డశ్వినిదేవతలకును, వారలు ధన్వంతరికిని, ధన్వంతరి యగస్త్యులకును, అగస్త్యులు పులస్త్యులకును, వారలు తేరయ్యార్కును, వీరు ఊహామునికిని క్రమముగ నుపదేశించినట్లు ఇందలిగ్రంథములనుండి తెలియుచున్నది.

ఈ సంప్రదాయ ప్రవర్తకులగు సిద్ధు లిరుదెరంగులు. అందు సంస్కృతభాషావైదుష్యముతో గూడిన వైద్యపాండిత్యముగలవారికి వడ (ఉత్తర) సంప్రదాయజ్ఞులనియు కేవల ద్రవిడభాషావైద్యపాండిత్యిని బడసినవారికి తెన్ (దక్షిణ) సంప్రదాయజ్ఞులనియు వాడుక.

ఇందు మొదటివారగు నగస్త్యులు తేరయ్యార్ భోగర్ పులిప్పాణి మొదలగువారు సంస్కృతభాషయందును ద్రవిడభాషయందును స్వతంత్రవైద్యగ్రంథరచనల సలిపిరి. మరియు కొన్నిటికి సంస్కృతమునుండి ద్రవిడభాషలో పరివర్తన మొనరించిరి. రెండవ తెగవార లధికముగ ద్రవిడభాషయందే వైద్యగ్రంథముల రచించిరి.

ఈరెంటియందును రసతంత్రప్రక్రియలు మెండు. ఈప్రక్రియలును వానివిభాగములును జారణమారణాద్యుపాయములును ప్రక్రియలును పరిభాషలును ప్రాయికముగ సంస్కృతభాషామయములగు నాగార్జునాది రసతంత్రములయందలి ప్రక్రియలకన్న భిన్నములుగ దెలియుచున్నవి.

—{ ఖనిజపదార్థములును, వాని విభాగములును. }—

ఈసంప్రదాయమున మైలతుత్థమునైనను సౌవీరమునైనను భస్మమును జేసి దానినే ప్రతిపదార్థమును భస్మమును జేయునపుడు మూలప్రకృతివలె సహాయముగ జేర్చెదరు. ఈ భస్మమునే గురుభస్మమందురు. సామాన్యభస్మమునకన్న గురుభస్మ సహాయమున జేసిన భస్మము వేయిమడుంగులు గుణాధికము. ఇట్టి ప్రక్రియ లీ సంప్రదాయమున మెండు. ఇందలి గ్రంథపరిశీలనమునుండియు నీసంప్రదాయప్రక్రియ లుపయోగించు ననుభవమునుబట్టియు నాగార్జునాది రసతంత్రముల విహితములగు భస్మసిందూరాదులకన్న నీయగస్త్యసంప్రదాయ బోధితములగు భస్మసిందూరాదులును వానిని జేయు ప్రక్రియాదులును సులభములనియు నుపయోగమున గుణాధికములనియు నాయభిమతము. ఇత్యాది విజ్ఞులకును విదితము.

మరియు ప్రత్యేకము దక్షిణాపథమందు ప్రసిద్ధిగాంచిన యనేకమూలికల గుణములు జెప్పబడినవి. ఈ మూలికాది

పదార్థములకు రసము, వీర్యము, విపాకము, ప్రభావము, గుణము, దీపనము, పాచనము, రసాయనము ననెడు సంప్రదాయముల ననుసరింపక కేవలము ప్రభావరూపగుణములే జెప్పబడియున్నవి. ఇంకను చరకసుశ్రుత వాగ్భటాదులయందు జెప్పంబడని శివనారివేంబు, కుప్పమేని, పూనరశం మొదలగు పెక్కుమూలికలు గలవు.

— ద్రవిడవైద్యవాఙ్మయము. —

పైజెప్పబడిన పదునెనిమిది సిద్ధులును ఈ సంప్రదాయబోధకములగు ననేకగ్రంథముల రచించిరి. వీనిలో కొన్నిటిని ద్రవిడభాషయందు పరివర్తితములుగ జేసినట్లు తేరయ్యార్ తిరుమూలర్ మొదలగువారి గ్రంథములనుండి తెలియుచున్నది. ఈ పరివర్తన మేకాలమున జరిగించబడినదను చారిత్రక విషయములు దుర్ఘటములగుటచేతను సంప్రదాయ గ్రంథములు విరళప్రచారములగుటచేతను పౌర్వాపర్యముల నిర్ణయించుట దుస్సాధముగనున్నది.

క్రీస్తుశకమున కెన్నియోవందల వత్సరములకు పూర్వము దక్షిణదేశమందు తామ్రపర్ణి మధుర మొదలగు స్థలములలో మూడుతడవలు ద్రవిడసంఘములు నెలకొల్పబడెను. ఆసంఘములయందనేక శాస్త్రీయ విషయములు విమర్శింపబడెను. అక్కాలమున ద్రవిడభాషా యోష వేదాన్తవైద్య సంగీత జ్యోతిషాదిశాస్త్రముల నలంకరించినదనుట లోకవిదితము. అందు

కడపటి మూడవసంఘమునాడు క్రైస్తవశకమునకు పూర్వమెంత కాలముక్రింద జరిగియుండెనో ఐతిహాసికులు నిర్ణయింప దుస్సాధ్యముగ నున్నది. ఇట్టి ద్రవిడభాషయందుగల వైద్య సారస్వతము ఇతర దేశభాషా వైద్యవాఙ్మయమునకన్న ముందటిది యనుట నిర్వివాదము. ఈ వాఙ్మయమున ప్రకృతము ముద్రితములును అముద్రితములునునగు గ్రంథములు దాదాపు నూటయేబది (150) గలవు. లభ్యములుగనున్న వానిలో గొన్నింటి నిట గనబరచెద.

అగస్త్యర్ పెరుంతిరట్టు
అగస్త్యర్ ఆయుర్వేదభాష్యము
అగస్త్యర్ భస్మమురై, (భస్మాది ప్రక్రియలు)
అగస్త్యర్ నాడినూల్, (నాడీనిర్ణయము)
అగస్త్యర్ ఆయిరత్తైనూర్
అగస్త్యర్ తొలికాప్యం
అగస్త్యర్ పరిపూర్ణం
పులిప్పాణి ఐనూర్
భోగర్ ఎణ్ణూర్
ఊహాముని ఆయిరం
రోమఋషి ఐనూర్

సనత్కు వైద్య
రామదేవర్ సిరినూల్
గోరక్కర్ వైద్యము (గోరక్షసిద్ధుల వైద్యము)
మత్స్యముని ఎణ్ణూర్
కరువూరార్ తిరట్టు
తేరయ్యార్ కరిశల్ మున్నూర్
అగస్త్యర్ ప[illegible]
శివజాలం
శక్తిజాలం
వర్మాథుజాలం
కొంకణర్ నిదానం

—అష్టస్థానపరీక్షావిధానము.—

ఇందు అష్టస్థానపరీక్షలచే రుగ్వినిశ్చయమును దెలుపు గ్రంథములు కొన్నిగలవు. ఇట్టి గ్రంథములయందు బోధితములగు

పరీక్షానిఘంటువులు చరకము, సుశ్రుతము, వాగ్భటము, మాధవనిదానము, చక్రదత్త మొదలగు గ్రంథములయందేమాత్రమును గనుపడని పోస్టుచేసి నాడీపరీక్షావిధానములం దొలుతొలుత గనిపెట్టినది యోగ స్వసంప్రదాయజ్ఞులనుట కవకాశము గలుగుచున్నది.

నాడీగ్రంథముల ప్రామాణ్యము.

మరియు నాడీనిదానమును మూత్రపరీక్షాక్రమమును దెలుపునవి ప్రత్యేకగ్రంథములు కొన్ని గలవు. అయ్యవి సంస్కృతమునందుండు నాడీనిదానాది గ్రంథములకన్న ప్రాచీనములుగను వాని కాధారభూతములుగను విపులములుగను గన్పట్టుచున్నవి. అట్టి ద్రవిడభాషా గ్రంథములబట్టి నాడీనిదానాది గ్రంథములు సంస్కృతమున వ్రాయబడియుండునాయను సందేహమును గల్గించుచున్నవి. ఈవిషయమును కూలంకషముగ విమర్శించిన గాని సిద్ధాంతముగ జెప్పజాలు.

ఈ సంప్రదాయమునందలి విభాగముల నన్నింటిని వివరించవలెనన్న గ్రంథవిస్తరమగునుగాన స్థాలీపులాకన్యాయముగ నాప్రియవైద్యసోదరులకు కొంతవరకు దెలిపితిని.

సింహళద్వీపము - ఆయుర్వేదము.

లంకాద్వీపము (సిలోన్ — లేక కొళంబు). ఈద్వీపమే పూర్వకాలమున దశాస్యుని రాజధానియని ప్రసిద్ధి. దీనినే ప్రకృతము సింహళద్వీప మనియెదరు. ఆనందకందగ్రంథకర్తయగు ప్రసి

ద్ధులగు మంథానభైరవు లీసింహళక్షోణిపాలుని యాస్థానమున విద్యావైద్యులు. రామరావణయుద్ధకాలమున శ్రీ వాయు తనయునిచే హిమాలయప్రాంతమునుండి తేబడిన విశల్యకరణి సంధానకరణి సావర్ణ్యకరణి సంజీవకరణియను నోషధిరత్నముల నలంకరించినది యీ లంకాద్వీపమే. పై నాలుగు విధములగు దివ్యౌషధుల నుపయోగించు పరంపరలలో సంధానకరణి నుపయోగించు పరంపర యిప్పటికిని యీ లంకాద్వీపమునగలదు. ఎముకలు విరిగినపుడును నలిగినపుడును కుదుర్చుటలో వీరు ఖ్యాతినందినవారు. సామాన్యముగ నెముకలు నలిగినపుడు సంధానమున్నకై సంధానకరణియను ఆకును పైనవేసి కట్టుదురు. మిలెటరి ఆఫీసు ఐ. యం. యస్., ఆఫీసు గొప్ప దొరలునుకూడ యెముకలు విరిగినపుడు వీరివద్దకే చికిత్సకేగదరు. పాశ్చాత్య చికిత్సల జేసికొనరు. ఇట్టివి యెన్నియో దివ్య మూలికలీద్వీపము నలంకరించియున్నవి. ప్రకృత మిచ్చట నాత్రేయాదిచికిత్సలును అగస్త్యసంప్రదాయచికిత్సలును వాడుకయందు గలవు.

ఇచ్చటి బుద్ధభిక్షువులు విశేషముగ నాయుర్వేదమున పాండితిని బడసియున్నారు. చరక సుశ్రుత వాగ్భటాదులు పఠనపాఠనములయందుగలవు. వీరికి రసతంత్రప్రక్రియలువిశేషముగ నభ్యాసమున లేవు. ఇచ్చట విద్యోదయ కలాశాలయందనేకులు బుద్ధులును బుద్ధభిక్షువులును నాయుర్వేదము నభ్యసిం

చుచున్నారు. వీరలు వరరుచివిరచితమగు "యోగశతకమును" కంఠస్థముగనుంచుకొని చికిత్సాచరణము జేయుదురు. ఇచ్చట నాయుర్వేదవైద్యము వ్యాపకముగా నున్నదనుటకు అఖిలభారతాయుర్వేద విద్యాపీఠమునకు జేరిన "ఆయుర్వేదాచార్య" పరీక్షకొరకు బుద్ధయువకులు ఈ సంవత్సరమున ప్రవేశపత్రిక (అప్లికేషన్) బంపియుండుటయే నిదర్శనము.

—(లంకాద్వీపము, వైద్యవాఙ్మయము.)—

సారార్థసంగ్రహము:—సంస్కృతమమూలము సింహళభాషానువాదసహితముగ గలదు. ఇయ్యది స్కంధత్రయాత్మక విషయబోధకము. ఖనిజ, ప్రాణిజ, ఉద్భిజ్జములు జేరిన యోగములును అధికముగ మూలికల ప్రయోగములును ఇందుగలవు. శల్యతంత్రప్రక్రియలును విరళముగ గలవు.

భేషజమంజూష:—ఇయ్యది పాళీభాషామయము. ప్రాచీనుడగు బుద్ధభిక్షువుచే విరచితము. ఇందు మూలికాప్రయోగము లధికములు. రసచికిత్సలును కొంచెముగలవు.

సారసంక్షేపము:—ఇది సంస్కృతభాషామయము. సింహళభాషాటీకాయుతము. రోగలక్షణచికిత్సాబోధకము.

భేషజకల్పము:—సంస్కృతము. పరిభాషాబోధకము.

యోగశతకము:—సంస్కృత వ్యాఖ్యాయుతము. ఇందలి యోగములు సిద్ధప్రక్రియలబోలియున్నవి. దీని ననుసరించిన చికిత్సలను విశేషముగ వీరుపయోగించెదరు.

సారస్వతనిఘంటువు, సిద్ధౌషధనిఘంటువు:—ఈ రెండును-పదార్థగుణములను బోధించునవియైయున్నవి. ఇందు దేశీయములగు మూలికలు కొన్ని చెప్పబడియున్నవి.

యోగరత్నాకరము:—ఇయ్యది గడచిన ఆరువందలవత్సరములవాడు "మయూరపాదభిక్షువు" అను వైద్యశిఖామణిచే విరచితము. ఇం దనుభవసిద్ధములగు నిదానచికిత్సలుగలవు.

పైగనుపరుపంబడినవి మొదలగు ననేక గ్రంథరాజములియ్యెడసంస్కృతభాషయందును సింహాళభాషయందునుగలవు.

—॥ కేరళదేశము - ఆయుర్వేదము. ॥—

దక్షిణాపథమున కేరళమని ఖ్యాతివహించిన దేశముగలదని తమకందరకును విదితమే. ఆదేశము కొచ్చి తిరువాంకూరు అను రెండు రాజ్యవిభాగములుగల్గి తదధిపతులచే పాలింపబడుచున్నది. ఈమహావైద్యసమ్మేళనమున సభానాయకత్వమును వహించియున్న మహారాజ మహాశ్రీయుతులే కొచ్చి రాజ్యాధిపతులు. కొచ్చిరాజ్యాధిపతులును మనసభానాథులును నగు మహారాజవిద్వచ్చూడామణి సాన్నిధ్యమున కేరళదేశవృత్తాంతమును మీకునివేదింప నుడలు వణకుచున్నది. మాటవెడలక రసనేన్ద్రియము తడబడుచున్నది. అయినను విద్వచ్చక్రవర్తియును భిషక్చూడామణియునగు సభానాయకునియొక్కయు ఆయుర్వేద వైద్యవిద్యావిశారదులగు తమయొక్కయు నిర్హే

తుకజాయమానకీటకపిపీలికాదులను సాపప్రసరించుటం జేసి నేని విషయమును నివేదింప సాహసించినాడ.

కేరళమున నాయుర్వేదప్రచారము హెచ్చుగ నున్నదని సర్వజనవిదితము. ఆదేశమున సామాన్యవైద్యులకుంగూడ అష్టాంగహృదయము కంఠస్థముగనుండును.

కొందరు అష్టాంగహృదయమునకన్న వేరొండు వైద్యగ్రంథము తెరచియు దలంచరు. శాస్త్రీయపద్ధతుల నొనరింప బడు స్నేహ స్వేదనవమన విరేచనాది శోధనచికిత్సలును తక్రధారాది ధారాకల్పప్రక్రియలును వీరిసొమ్ము. ఈశోధనాదిచికిత్సలు భారతదేశమున వేరొకచోట వాడుకయందు లేవనుట స్పష్టము.

—(మూలికల యంగడులు.)—

ఈదేశమున వైద్యులకు మందుల కుపయోగింపదగిన మూలికలనమ్మువారు కొందరు గలరు. వారు శుష్కంబులును ఆర్ద్రంబులును నగు నౌషధములను సిద్ధపరచి యెల్లపుడు నంగటిలో నుంచెదరు. వైద్యులు రోగికి శాస్త్రసాంకేతితములగు దశమూల పంచమూల పంచమిత్రాదిగణములను వానివాని భాగభేదముల నిర్ణయించి యొకపట్టికను లిఖించి యిచ్చెదరు. రోగి యాపట్టికను మందులంగడివారికిజూప వారు సాంకేతిత నిర్ణయప్రకార మౌషధముల నిచ్చుటకలదు. మరియు నాదేశ

మున క్షీరబలాది అసనాది ధన్వన్తర్యాది మున్నగు తైలాది-యోగముల నుపయోగించు పదార్థములంగోరిన నాయంగడి వారు విధులననుసరించి యౌషధద్రవ్యముల నిచ్చెదరు. ఇట్టిసంప్రదాయము కేరళవ్యతిరిక్తదేశమున గన్పట్టదు.

—॥ అష్టవైద్యులు. ॥—

మరియు నీదేశమునం దష్టవైద్యులను నెనిమిది వైద్యకుటుంబములవారు గలరు. వీరలు శ్రీపరశురాముని కాలమున శల్యశాలాక్యాద్యష్టాఙ్గముల నుపదేశమునొందిన వైద్యులని వాడుక కలదు. వీరునంబూరీబ్రాహ్మణులు. మిక్కిలి ధనవంతులు. వీరిసంతతు లిప్పటికిని కేరళమునగలవు. అష్టాఙ్గములలో జేరిన యొక్కొకయంగము నొక్కొక రవలంబించి చికిత్స జేయుటచే వీరి కష్టవైద్యులని నామధేయము గలిగెను. వీరు ప్రతిదినంబును తొలుత ధన్వంతరిపూజసలిపి పిమ్మట రోగులకు చికిత్స జేయగడంగుదురు.

మరియు నందు కోటయ్యంవైఖరిమూసు అనువారు మహాధనవంతులు. వీరు రాజసన్మానముచే నరువదినాల్గు (64) గ్రామముల నొందియున్నారు. వీరి గృహావరణమున ధన్వన్తరి దేవాలయముకలదు. వీరనుదినంబును ప్రాతఃకాలమున ధన్వన్తరిపూజలొనరించియే చికిత్స జేయుదురు.

1909-జనవరిలో కొల్లంగోడు రాజాస్థానమున నాయధ్యక్షకత క్రింద జరిగిన యాయుర్వేదసమాజానుబంధమగు సప్తమ

వైద్యసమ్మేళనమున కేరళదేశమందుగల వైద్యమహాశయు లలో గొందఱకు దర్శనభాగ్యము కలిగినది. ప్రకృతమునం దిచ్చట వైద్యరత్న బిరుదాంకితులును ప్రసిద్ధవిద్వద్వైద్యులును నగు శ్రీవైద్యరత్నపరమేశ్వరనమూసద్ గారు వైద్యశిరోమణు లగు పెళ్ళాంతోళ మూసుగారి శిష్యపరంపరకు జేరియున్నారు. వీరిచికిత్సానైపుణ్యము లోకవిదితము. ఈపరంపరల నుండువా రును వీరికి జేరినవారును ఇప్పటికిని నేత్రశ్రోత్రాది ప్రత్యేకచికిత్స కులును విషచికిత్సకులును నై యున్నారు.

మన స్వదేశసంస్థానాధిపతుల కార్యవిద్యాలయం దభిమా నము పొందినట్లు లోకవిదితము. కేరళసంస్థానాధిపతులకు ఆర్య విద్యాలయం దభిమానమున్మాత్రముగాక వారుస్వయముగ సర్వ తన్త్రస్వతన్త్రులుగను విద్వద్వైద్యచూడామణులుగను ఉన్నా రనుట కీవైద్యమహాసమ్మేళనమున సభాధిపత్యమును వహిం చిన మహారాజుగారే దృష్టాన్తము.

మరియు ప్రకృతపు కొచ్చిమహారాజులు మహాపండితుల నియు విద్వద్వైద్యులనియు, సప్తమరాజకుమారులును మన ఆయుర్వేదవిద్యాపీఠమునకుపాధ్యక్షులునగు శ్రీరాజారామవర్మ గారు వైద్యవైదుష్యముతో గూడిన విషవైద్యమున నైపుణ్యము గలవారనియు మీకు నివేదించుటకు నాకు మిక్కిలి సంతోష ము గలుగుచున్నది. ఈ శ్రీరామవర్మరాజాగారు కొన్నిమాస ములక్రిందటనే విషవైద్యశాల నారంభించిరనియు మీకందర

కును విదితమయ్యేయున్నది. కొలదిదినములలోపుగనే కొచ్చి-రాజ్యమున గొప్పఆతురాలయమును ఆయుర్వేదమహావిద్యాలయమును విద్యార్థివసతిగృహమును నెలకొల్పబోవుచున్నారని చెప్పుటకును మిక్కిలి సంతోషమగుచున్నది. మరియు గడచిన జనవరిమాసమున కళ్లికోటయను స్థానమున నాప్రియమిత్రులగు శ్రీయుత. పి. యస్. వార్యర్ గారి ముఖ్యప్రేరణనుండి యొక ఆయుర్వేదకలాశాల స్థాపింపబడియున్నది.

—అనంతశయనరాజ్యము-ఆయుర్వేదము.—

అనంతశయనరాజ్యమున చికిత్సాప్రచారము మెండు. ఈరాజ్యమున గొప్పదియగు నాయుర్వేదమహావిద్యాలయము కలదు. ఇందుత్తమతరగతియందుత్తీర్ణులైనవారు దాదాపు రెండువందల(200) మందిగలరు. ఈరాజ్యమునందంతటను రాజకీయాయుర్వేద వైద్యశాలలు డెబ్బదిరెండు(72)గలవు. ఈవైద్యశాలలుపై జెప్పబడిన రాజకీయవైద్యకలాశాలయందును ఇతర వైద్యకలాశాలలయందును ఉత్తీర్ణులగు విద్వద్వైద్యులచే నిర్వహింపబడుచున్నవి. ఈవైద్యశాలలసంఖ్య ప్రతిసంవత్సరంబునను హెచ్చింపబడుచున్నవి.

ఈ వైద్యశాలలన్నియు ‘‘సూప్రరింటెండెంటు ఆఫ్ ఆయుర్వేదవైద్యశాలాస్’’ అనునొక ఆయుర్వేద వైద్యశాలాధికారి నిరీక్షణముక్రింద దొరతనమువారిచే నుంచబడియున్నవి. ప్రతి వత్సరమునను పై వైద్యశాలలకై దొరతనమువారు 1915-16

వత్సరమున 15809 పదునైదువేల యెనిమిదివందలు తొమ్మిది రూపాయిలు వెచ్చించియున్నారు. మరియు పై వైద్యశాలల యందు 1914-15 వత్సరమున 136074 మంది రోగులును, 1915-16 వత్సరమున 143505 మంది రోగులును చికిత్సనందిరని యీ 1916 సంవత్సరపు నివేదిక నుండి తెలియుచున్నది.

భారతదేశమున, ప్రాంతికముగ డెబ్బదిరెండు (72) ఆయుర్వేదవైద్యశాలలను పోషించు స్వదేశసంస్థానము మఱి యొకటి లేదని మీకు నివేదింప నత్యంత సంతోషముగనున్నది. ఈరాజ్యమున పాశ్చాత్యచికిత్సలకై 484479 రూపికముల ద్రవ్యమును వెచ్చించెదరు. ఈద్రవ్యవ్యయముచేత 869563, మంది రోగులకు చికిత్సాసహాయము లభించినది. పైకనబరచిన రెండువిషయములను వైద్యములలో నేచికిత్స సులభంబును అల్ప వ్యయముచే నిర్వాహ్యంబునునై యుండునో విజ్ఞులకే గోచరమగునుగాన నేను వివరింపనక్కర లేదు.

శ్రీ మహారాజాగారిని ఆయుర్వేదవైద్యము విషయమై యింతకన్న నధికమగు ప్రోత్సాహమును గల్గించుటకును అష్టాంగములతో గూడిన ఆయుర్వేద చికిత్సలకును, ప్రత్యేక ప్రత్యేకముగ చికిత్సావిధానముల యవకాశము గల్గించుటకు మిక్కిలి వినయవిధేయుడనై ప్రార్థించెదను.

—(కేరళము వైద్యప్రాశస్త్యము.)—

కేరళమున అష్టాంగహృదయమునకన్న వేరొండు వైద్య గ్రంథమునకు, ప్రాబల్యము లేదని తెలిపియుంటిని. దీనికి హృదయ

ప్రియయను చక్రపాణివ్యాఖ్యకలదు. ఇయ్యది కేరళభాషయందు పరివర్తనమొనరింపబడినది. అష్టాంగసంగ్రహమునకు, ఇందు టీకయను చక్రపాణి వ్యాఖ్యను ముద్రించియున్నారు. ధారాకల్పము, సహస్రయోగము అను గ్రంథములు ప్రశస్తములు, ఇచ్చట కొలదికాలమునుండి చరక సుశ్రుతాదులను రసగ్రన్థములనుగూడ ప్రచారమునకు దెచ్చుచున్నారు. వైద్యపుంగవులును నాప్రియమిత్రులునగు వైద్యనారాయణనాయర్ కొల్లంగోడువారు సుశ్రుతమును కేరళభాషయందు పరివర్తనమొనరించిరి. ఈ ప్రాంత్యమునసె చరకమునుగూడ కేరళభాషనలంకరింపజేసిరి.

కార్ణాటికరాజ్యము, ఆయుర్వేదము.

కర్ణాటక రాజ్యము చిరకాలమునుండియు నార్యవిద్యల కాటపట్టయినదియని ప్రసిద్ధము. నేటికిని యీప్రాచీనాచారమే యిచ్చట వాడుకలోనున్నది. నావిద్యకును ఆయుర్వేదమునకు నేజేసెడు ప్రతిసేవకును నాస్థితికిని జీవికకును ముఖ్యాధారమైన మైసూరునగరమున దొరతనమువారిది గొప్పదియగు నాయుర్వేదకలాశాలగలదు. ఇందనేకులు వైద్యవిద్యనభ్యసించెదరు. దీనికనుబంధముగ ధర్మవైద్యశాలయొకటి కలదు. ఇందు విద్యార్థులకు కర్మపథమును బోధించెదరు. ఇదిగాక యీరాజ్యమున ముప్పదియారు (36) ఆయుర్వేద ధర్మవైద్యశాలలును ఐదు (5) యూనానీ ధర్మవైద్యశాలలును గలవు. వీని

నన్నింటిని వైద్యశాలలయందు చదివి పరీక్షలయందు త్తీర్ణులగు విద్వాంసులైన వైద్యులు నిర్వహించెదరు. వీనిపోషణమునకై దొరతనమువారు ప్రతివత్సరమున దాదాపు పన్నెండువేల(12000) రూప్యములను వ్యయము జేయుచున్నారని దెలియుచున్నది. ఈ నలువదియొకండు (41) ధర్మవైద్యశాలలయందును 1915 వత్సరమున 314391 రోగులును 1916 వత్సరమున 328763 రు రోగులును చికిత్స బొందియున్నారు. ఈరాజ్యమున నాంగ్లేయ చికిత్సాసాహాయ్యమునకై వత్సరమునకు 452365 రూప్యములు వెచ్చింపఁబడుచున్నవి. స్వదేశ సంస్థానములలోఁగూడ పాశ్చాత్యవైద్యమునకు జేయు సహాయములలో నేకదేశమైనను స్వదేశవైద్యమునకు, కనబడలేదు.

సర్వజనసామాన్యంబును అల్పవ్యయముచే సులభసాధ్యంబునునగు దేశీయవైద్యమును ఇంతకన్న ప్రోత్సాహమును గల్గించి వృద్ధినందించుటకై శ్రీమన్మహారాజుగారిని సవినయముగ బ్రార్థించెద. శ్రీమన్మహారాజుగారు ఆయుర్వేదవైద్యముతోపాటు యూనానీవైద్యమునుగూడ పోషించుచున్నందుకు మనమందఱమును వందనసహస్రముల నర్పింపవలసియున్నది.

—॥ కర్నాటకమున ప్రసిద్ధవైద్యులు. ॥—

ఈరాజ్యమున నంతటను వైదికతాన్త్రిక మిశ్రములను చికిత్సలుండెను. పూర్వకాలమున జైనులు విశేషఖ్యాతిగల వైద్యులుగనుండిరి. వీరిలో పూజ్యపాదులు, ఉగ్రాదిత్యాచార్యులు, మంగరాజు, అభినవచంద్రుడు, మున్నగువారు ప్రసిద్ధులు.

వీరి పరంపరకు జేరిన సూరిపండితులు చంద్రపండితులు అను సోదరవిద్వద్వైద్యులు స్వర్గీయకృష్ణరాజ ఒడయర్ మహారాజులవారి ఆస్థానవైద్యులలో సగ్రగణ్యులై యుండిరి. వీరి పరంపరకు జేరిన దినచంద్రపండితుల కుటుంబముగారు ఇప్పటికిని వ్యాపకులుగ నున్నారు.

మఱియు నస్మదాచార్య గురుపరంపరా ప్రఖ్యాతులగు విద్వద్వైద్యులును ఇతరులగు వైద్యపుంగవులును ఈసంస్థానమున మిక్కిలి ప్రసిద్ధినొందియున్నారు.

—(కర్ణాటరాజ్యమున సంస్కృతవైద్యవాఙ్మయము.)—

కర్ణాటరాజ్యమునందు ఆయుర్వేదీయవైద్యవాఙ్మయము సంస్కృతభాషయందును కర్ణాటకభాషయందును చిరకాలము నుండియు మిక్కిలి యభివృద్ధినొందియున్నదనుటకు అనేకదృష్టాంతములుగలవు. అందు కొన్నిటి నిట్టుదహరించెదను.

పూజ్యపాదులు:—వీరిచే విరచితమగు గ్రంథమునకు పూజ్యపాదీయమని పేరు. వీరు క్రైస్తవ 470 A. D. కాలమునాటి వారని ప్రసిద్ధము. మైసూరు రాష్ట్రమునంగల కోల్ హగాలమను గ్రామమున భూసురకుటుంబమున జన్మించిరి. వీరు కొంతకాలమునకు పిదప జైనమతదీక్ష నవలంబించి వైద్యమంత్రయంత్రాది శాస్త్రములయందు ప్రవీణులైనట్లు 1205-A. D. కాలపు పార్శ్వపండితులనువారు వ్రాసియున్నారు.

ఉగ్రాదిత్యాచార్యులు:—వీరలు 814 ఏ.డి. కాలమున నుండిన రాష్ట్రకూట వంశమునకు జేరిన నృపతుంగమహారాజు గారి యాస్థానమున వైద్యులుగనుండి శ్రీ. శ్రీ. జినునిచే మగధ భాషయందు గ్రంథింపబడిన కల్యాణకారకమను గ్రంథమును సంస్కృతభాషయందు తానువ్రాసినట్లులు తనగ్రంథమున జెప్పి యున్నారు. మరియు వారు నాటిసమయమున హస్తిచారి, విశాల్య, విభంగపైన, వైదిగ్భసగ, కాంకాయన, వాగ్బలి, మృగ శర్మ, సుశ్రేష్ఠప్రముఖులగు వైద్యపుంగవులచే సలంకృతంబగు నొక గొప్పసభను జేర్చి యాసభయందున మాంసభక్షణవిష యకమైన చర్చనొనరించి, "బహువిధజీవవధనిమిత్తం, మధు మద్యమాంసాదికశ్లాలాహారగని షేవణం, అశేషదోషప్రకోపనం, అతిపాపహేతుకం, అఖిలవ్యాధ్యుత్పత్తినిమిత్తకం, అతినింద్యం, అభక్ష్యం, అతిదాస్సహం, దుర్గతిహేతుకం దూరాదేవనిరా కృతం" ఇవి మొదలగు గంభీరవాక్యములచే మధుమద్యమాం సాద్యశనమును నిందించిరి. ఈవిషయమును తనగ్రంథమున "ఖ్యాతశ్రీనృపతుంగవల్లభ మహారాజాధిరాజాస్థితః ప్రోద్య ద్భూరిసభాంతరే బహువిధప్రఖ్యాతవిద్వజ్జనే, మాంసాశిప్రక రేన్ద్రితాఖిలభిషగ్విద్యావిదామగ్రతః మాంసేనిష్ఫలతాంనిరూ ప్యనితరాం జైనేన్ద్రవైద్యస్థితః" అనుశ్లోకముచే సూచించెను.

—(కర్ణాటక వైద్యవాఙ్మయము.)—

ఈరాజ్యమున సంస్కృతవాఙ్మయముతోబాటు కర్నా టకభాషయందును వైద్యవాఙ్మయము కొన్నివందల సంవత్సర

ములనుండియు ప్రచారముననున్నట్లుగాను దెలియుచున్నది. అట్టి గ్రంథములు కొన్ని కర్నాటభాషయందును ఛందోబద్ధములుగను కొన్ని వాక్యరూపములుగను కొన్ని సంస్కృతమునకు టీకలుగను గన్పట్టుచున్నవి.

మంగరాజు:—ఇతడు జైనమతానుయాయి; ఇతడు 1360-ఏ. డీ. క్రైస్తవశకముననున్నవాడు. హొయ్సళరాజ్యమునకు జేరిన దేవళిగెయను మండలమున ముగుళియను పట్టణమునకు ప్రభువుగనుండెను. వీరు స్థావరజంగమాది విషచికిత్సలబోధించు "ఖగేంద్రమణిదర్పణము" అను గొప్పగ్రంథమును కన్నడభాషయందు పద్యాత్మకముగ రచించిరి. ఇందలి స్థావర జంగమ విషచికిత్సలను పూజ్యపాదగ్రన్థమునుండి గ్రహించినటులు వ్రాసియున్నారు. వీరు "కవిజనైకమిత్ర" "సాహిత్యవైద్య విద్యాజలనిధి" "భిషగ్వరతిలక" ఇవి మున్నగు బిరుదముల నొందియుండిరని తెలియుచున్నది.

అభినవచన్ద్ర:—వీరలు క్రైస్తవ 1400-వ శతాబ్దము నాటివారనియు బ్రాహ్మణులనియు తెలియుచున్నది. వీరు 1079-వ క్రైస్తవశకమునాటి మదనతిలకమను గ్రన్థమును రచించిన చంద్రరాజనువాని గ్రన్థముల నుదహరింపుచు సిహ్మదత్తవిరచితమగు నశ్వవైద్యమును హొసగన్నడము (నవీన కర్నాటకభాష) న పద్యరూపముగ రచించెను. ఇయ్యది మిక్కిలి చక్కని గ్రన్థము.

క॥ ఘనమునగు హయశాస్త్రగము ।
ననుపమయోగ సిద్ధాంత సత్కృతలక్షణమ్ము ।
దినకరతనయుండెలమి ।
తనయుతమున కేశ్వణయా సాంగమ్ము దరిం

ఇది మున్నగు సంస్కృతములచే నీగ్రంథము విరచితము.

మరియు శ్రీ వసంతరాజీయమునగు దేవేంద్రమునికృతమగు బాలగ్రహచికిత్సయను గ్రంథములును. సాల్వ, చికిత్సోపాధ్యాయసంజరాజు, వ్యాసహర్షభట్టప్రభృతు లనేకవైద్యగ్రంథముల రచియించిరి. చంద్రరాజ రామచంద్రులు మొదలగువారు అశ్వవైద్యమును, చాళుక్యరాజగు కీర్తివర్మలనువారు గోవైద్యమును, సోమేశ్వరరాజనువారు పాలకాప్యకృతహస్త్యాయుర్వేదమునకు వ్యాఖ్యానమును రచించిరి.

ఇట్లే యాయుర్వేదము, చింతామణి, వైద్యసారసంగ్రహము, చికిత్సాసారసముచ్చయము మున్నగు ననేక గ్రంథములు 11-12 క్రీస్తుశతాబ్దముల కాలమునుండియు కర్ణాటకభాషయందు నలంకరించి యున్నవి. ఇంతకు కొన్ని శతాబ్దములకుపూర్వము అశ్వవైద్య గజవైద్య గోవైద్యగ్రంథముల భాషాంతరమున బరివర్తించుటంజూడ నప్పటి రాజ్యపాలనమునకు నశ్వాదిసంరక్షణ మత్యావశ్యకమని దలంచి సౌకర్యమునకై పరివర్తించిరని యూహింపదగియున్నది.

—॥ ఆంధ్రదేశము ఆయుర్వేదము. ॥—

ఆంధ్రదేశమున చరక సుశ్రుత వాగ్భటాదులలో జెప్పిన ప్రయోగములకన్న ననేక స్వతంత్రప్రక్రియోపయోగములధికములు.

ఇచ్చటి వైద్యవరులు రసతన్త్రవిహితములగు మహాలక్ష్మీవిలాసరసము, రాజమృగాంకము, మహారాజమృగాంకము, కాన్తవల్లభరసము మొదలగు ననేకౌషధముల నిర్మాణముసందును వానిని చికిత్సల నుపయోగించుట యందును మిక్కిలి సమర్థులు. పారదభస్మమును సర్పవిషమును నిర్భీకముగ నుపయోగించెదరు. ఈదేశమున లంఘనచికిత్సలు రసదు.

—(ఆంధ్రదేశమున సంస్కృత వైద్యవాఙ్మయము.)—

వీరి చికిత్సాప్రచారమునకు చిన్తామణి బసవరాజీయము లనుగ్రన్థములు ఆధారములు. అందు చిన్తామణి వల్లభేన్ద్రునిచే విరచితము. ఇతడు నియోగిభూసురుడగు విద్వద్వైద్యుడు. వీరలు 15 లేక 16 క్రీస్తుశతాబ్దములనాటివారని తెలియుచున్నది. ఈగ్రన్థమునం దష్టస్థానపరీక్ష లనుపేరున నాడీమూత్రాది పరీక్షలచే రోగముల దెలియు నుపాయముల జెప్పి నిదానలక్షణచికత్సలంగూడ వివరముగ దెలిపియున్నది. మరియు చరకాది గ్రన్థములకన్న విపులముగ జ్వర భేదములు నిరూపితములు. మరియు పదిమూడు సన్నిపాతభేదములను వానిలో సాధ్యాసాధ్యములను వానిదశావస్థలను విపులముగ జూపియున్నాడు. చికిత్సల దెలుపునప్పుడు రసతన్త్రవిహితములగు రసయోగములను లేహతైలాది యోగములనుగూడ ననేకములుగ జూపియున్నాడు.

బసవరాజీయము:— ఇయ్యది చింతామణికన్న నొక శతాబ్దము వెనుకటి (16 లేక 17 క్రీ॥ స్తవశతాబ్దము) కాలమున రచింపబడినదని చెప్పవచ్చును. ఈ గ్రన్థకర్తయగు బసవరాజు ఆన్ధ్ర శైవబ్రాహ్మణుడు. ఈయన యనుభవసిద్ధముగు వైద్యమునందు మిక్కిలి సమర్థుడు. జ్వర సన్నిపాత పైత్యరోగ శ్లేష్మరోగ కాసరోగాది నిదానముల విపులముగను జెప్పియున్నాడు. నాడీభేదముల నతడు వర్ణించి నంతకన్న నధికముగ వివరించెను. నాడీ మూత్రాది పరీక్షలచే రుగ్విశ్చయోపాయముల బోధించుచు చికిత్సాభాగమున తనకు స్వానుభవసిద్ధములగు ననేకౌషధయోగములను మహోదారతతో నిరూపించియున్నాడు. భావమిశ్రులచే గ్రహింపబడిన యహిఫేనము పారంగికాయ గసగసాలు రేవలచిన్ని మొదలగు వానినన్నిటిని చికిత్సాయోగముల గ్రహించియున్నాడు. మరియు తన కనుభవసిద్ధములగు యోగములను ఆన్ధ్రపద్యములచే జెప్పియున్నాడు. ఇందు చెప్పబడిన మూలికలన్నియు నాన్ధ్రదేశమున ప్రాయికముగ దొరకునవి. అందు గోడ్డుకాకర, వాలుడు, చెన్నంగి, మదనబుడత, చేతరాసి, సముద్రపాల మున్నగునవి యనేకములు గలవు.

— ఆంధ్రవైద్యవాఙ్మయము. —

మరియు నియ్యెడ చరకము సుశ్రుతము వాగ్భటము మాధవనిదానము భేషజకల్పము రసప్రదీపిక శార్ఙ్గధరసంహిత రసరత్నాకరము పైని చెప్పబడిన బసవరాజీయ చింతామణులు

మున్నగు గ్రంథములకు తెనుగుటీకారూపములును వ్యాఖ్యానరూపములునునగు గ్రంథములు గన్పట్టుచున్నవి.

— ఆంధ్రపద్యాత్మకములు. —

అష్టాంగహృదయము, భేషజకల్పము, రసప్రదీపిక, నవనాథసిద్ధదీపిక, ఆంధ్రవైద్య చింతామణి, శతశ్లోకి, ఆయుర్వేదార్థసంగ్రహము, ధన్వంతరివిజయము, భిషగ్వరాఖ్యానము, నృపరాజీయము, మాతాధ్యాయము, మదనకామరత్నము, ఇవి మున్నగు ననేకగ్రంథము లాంధ్రపద్యరూపములుగ వైద్యవాఙ్మయమును గడచిన మూడునాలుగు శతాబ్దముల కాలమునుండియు నలంకరించియున్నవి.

— హైదరాబాదు ఆయుర్వేదము. —

దక్షిణభారతమునందలి యాంధ్రదేశమునం దొకభాగమైన నైజాంరాష్ట్రము కలదు. ఈరాష్ట్రమునకు హైదరాబాద్ అను ప్రధానరాజధాని కలదని యెల్లరకును విదితము. ఇయ్యెడ యవన (యూనానీ) వైద్యము తోబాటు ఆయుర్వేదవైద్యమునకును ప్రాధాన్యము కలదు. ఈ రాజ్యమందలి చికిత్సలు వైదికతాంత్రికమిశ్రమములై యుండును. లంఘనచికిత్సలు మెండు. వమనవిరేచనాది శోధనచికిత్సల ప్రశంసయైనను గన్పడదు. ఇయ్యెడ రసతంత్రశోధితములగు రత్నాది మిశ్రౌషధముల విశేషముగ నుపయోగించెదరు. ఈరాష్ట్రమునందలి ప్రజలును రాజబంధువులును రాజాస్థానమువారును యూ

నాని ఆయుర్వేద వైద్యముల రెండింటిని విశేషముగ నుపయోగించెదరు.

ఈరాజ్యమునఁ బ్రసిద్ధులైన యాయుర్వేద వైద్యపుంగవులు కొందరు గలరు. అందు లోకనాథబాబు అనువారు మిగుల ప్రసిద్ధులుగానుండిరి. కవిరాజ హరిగోవిందజీవారు వైద్యశాస్త్రము ననేకులకు బోధించుచు ప్రస్తుతమున నీరాజధానిలో ఖ్యాతిని వహించియున్నారు.

ఈరాజ్యమున పదునేడు (17) ఆయుర్వేద ధర్మవైద్యశాలలును, ముప్పది (30) యవనవైద్యశాలలును కలవు. మొత్తము ఈ 47 యునానీ ఆయుర్వేద వైద్యశాలలయందు 119588 గురు రోగులు చికిత్సనొందియున్నారు. ఈధర్మవైద్యశాలల పోషణమునకై దొరతనమువారు ప్రతివత్సరమును దాదాపు 63781 రూపాయిల ధనమును వ్యయము చేసెదరు.

శ్రీ నైజామువారి దొరతనమువారు ఆంగ్లవైద్యశాఖయందు 901134 రూపాయిలు వ్యయముచేయుచున్నారు. ఈవ్యయముచే 102 ఆంగ్ల వైద్యశాలలు పోషింపబడుచున్నవి. ఇందు 872426 రు రోగులు చికిత్సాసహాయమును బొందియున్నారు. పై వైద్యశాలల సంఖ్యను రోగులసంఖ్యను ద్రవ్యవ్యయము యొక్క మొత్తమును బరికించిన స్వదేశ వైద్య ఆంగ్లేయవైద్యములలో నేదిసులభమైనదియు స్పష్టమగుచున్నది.

పైగనుబరచిన సంఖ్యలమొత్తము నైజాముదొరతనము వారి 1915 నివేదికనుండి తెలియుచున్నది.

శ్రీనైజాముదొరతనమువారు యూనానీవైద్యమును పోషించుటయేగాక ఆయుర్వేదవైద్యమునుగూడ పోషించుచున్నందుకు మనమందరమును వారికి వందనశతముల నర్పింపవలసియున్నది. మరియు స్వదేశవైద్య పోషణమునకై యింతకన్న నధికముగ దోడ్పడవలెనని నైజాముదొరతనమువారిని వినయముతో ప్రార్థించెదను.

—(చెన్నరాజధాని - వైద్యవ్యాప్తి.)—

చెన్నరాజధానియందు గడచిన కొన్నివత్సరములనుండి వైద్యకలాశాల యొకటియు వైద్యపాఠశాల యొకటియు కలదు. వీనిచే సర్వప్రాంతమున వైద్యవిద్యాభివృద్ధి కల్గియున్నది. ఇందు నాచే పదునారు (16) వత్సరములుగ నిర్వహింపబడు నాయుర్వేదకలాశాలయందు సంస్కృతశాఖయనియు ఆంధ్రశాఖయనియు రెండుశాఖలు కలవు. ఇందు ఆయుర్వేదముతోపాటు 'అనాటమీ' 'ఫిజియాలజీ' మున్నగు నెనిమిది యాంగ్లవైద్యవిషయములును బోధింపబడును. ఇందు చెన్నరాజధానివారలేగాక పంజాబు గుజరాతి సింధు బెంగాల్ మొదలగు దూరదేశమునుండియు విద్యార్థులువచ్చి విద్యనభ్యసించుచున్నారు. ఇందు నిర్ణీతములైన పరీక్షలయందు తీర్ణులైన వారలలో కొందరు అమరచింత గద్వాల మొదలగు రాజాస్థానములయందు విద్వద్వైద్యులుగను, కొందరు వైద్యప్రచారకు

లుగను, మఱికొందఱు వైద్యశాలానిర్వాహకులుగను, కొందరు వైద్యపత్రికాప్రచారకులుగను నున్నారు. ఇందు త్తీర్ణులగువారికి ఆయుర్వేదభూషణ, భిషగ్వర, యను బిరుదము లొసగబడును. ఇచ్చట నాయుర్వేదభూషణ బిరుదమునొందిన యొక కేరళీయ వరుడు ఆంగ్లద్వీపమునందలి ఎడింబరో పట్టణమున విఖ్యాతమైన విశ్వవిద్యాలయమునందు ఎమ్,ఏ; ఎమ్,బి; సి,హెచ్,బి., అను వైద్యకబిరుద పరీక్షకై నాల్గవసంవత్సరభాగమును జదువుచున్నాడని మీకు నివేదింప సంతోషము గల్గియున్నాడను. ఈ బాల వైద్యుడు ఆయుర్వేదభూషణపరీక్షలో నియ్యెడ గెలుపొంది కలకత్తా నగరమున కేగి యచ్చట పాశ్చాత్యపతిక వైద్యమును ఆంగ్లవైద్యమును పట్టభద్రుడై యంతట తృప్తినందక ఎడింబరోనగరమున వైద్యకళాశాలయందు పైజెప్పిన పరీక్షకై చదువుచున్నాడు. ఇంక కొలదిదినములలో పరీక్షయందు కృతార్థతనొందిన భారతదేశమునం దాయుర్వేదప్రచారమునకు మిక్కిలి తోడ్పడునట్టుల మీరందరు నాశీర్వదించవలెనని వేడెద.

మరియు రెండవ ఆయుర్వేదవైద్య పాఠశాల యీ రాజధానియందు కీర్తిశేషులైన హానరబుల్ వి.కృష్ణస్వామిఅయ్యర్ సి. ఐ. ఇ; సి. ఎస్. ఐ; గారిచే నెలకొల్పంబడినది. ఇందు త్తీర్ణలగువా రీరాజధానియందలి దక్షిణప్రాంతమున విద్వద్వైద్యులుగనున్నారు. కొందరు వైద్యశాలానిర్వాహకులుగ నున్నారు.

పై విద్యాలయములయందు జదువు విద్యార్థులు కగ్రపథము నభ్యసించుటకై తదనుబంధముగ ధర్మవైద్యశాలలు గలవు. ఈ రెండు వైద్యశాలలయందును సంవత్సరమునకు 40 (నలువది) వేల రోగులు చికిత్స చేయబడుచున్నారు.

పై రెండుగాక యీమహాపట్టణమున తిరువల్లిక్కేణియందు రావుసాహెబ్ కలవల కణ్ణన్ సెట్టిగారిచే నేర్పరుపబడిన ఆయుర్వేద ధర్మవైద్యశాలయు, జార్జిటౌనులో శ్రీకన్యకాపరమేశ్వరీ ధర్మవైద్యశాలయు, వేపేరియందు చెంగల్వరాయ ధర్మాయుర్వేద వైద్యశాలయు నుంగంబాకమున ధర్మాయుర్వేద వైద్యశాలయు జేరి నాలుగు ధర్మవైద్యశాలలు గలవు. ఇందు తిరువల్లిక్కేణి వైద్యశాలలో ప్రతిదినమున నాల్గునందల(400) నుండి అయిదువందల (500) రోగులు చికిత్స నందుచున్నారు. ఈప్రకారము మా వైద్యశాలయందు సంవత్సరమునకు దాదాపు లక్షయేబదివేల (150000) మంది రోగులు చికిత్సాసహాయమును బొందుచున్నారని దెలుప నామనస్సుప్పొంగుచున్నది. ఇట్టిమొత్తసంఖ్యకల రోగులు రాజకీయమహా వైద్యాలయమునకును వచ్చుటలేదని మీకు నివేదింప మీ కెంత సంతోషముగల్గునో నేనూహింపజాలను. తక్కిన రెండువైద్యశాలలయందు దాదాపుగ సంవత్సరమున కరువదివేల (60000) నుండి డెబ్బదివేల (70000) రోగులవరకు చికిత్సనుబడయుచున్నారు.

ఇంకను నెలకొల్పిన నుంగంబాకం ధర్మవైద్యశాల విఖ్యాత ధర్మమూర్తులును దాతశ్రేష్ఠులునునగు రావుసాహేబు కలవల కన్నన్ శెట్టిగారు, మదరాసు షెరీఫ్ రావుసాహేబు క. రామానుజం శెట్టిగారు మొదలగువారిచే నిర్మింపబడినదై స్థాపితమని ఆనరబుల్ జస్టిస్. అబ్దుల్ రహీం సాహేబు బహద్దర్ వారిచే బహిరంగపరుపబడినదని సభానాయకులగు శ్రీమన్మహారాజా వారికిని సోదరవైద్యబృందమునకును విన్నవించ నుల్లాసముగనున్నది.

—(మండలధర్మవైద్యశాలలు.)—

శ్రీరంగక్షేత్రమున శ్రీప్రసన్న వేంకటేశ్వర ధర్మవైద్యశాలయు నెల్లూరుపురమున రంగకర్ణాటక ధర్మాయుర్వేద వైద్యశాలయును రామేశ్వరమున అచ్చుటి దేవాదాయధర్మములనుండి యేర్పడిన యొకధర్మవైద్యశాలయునుగలసి మొత్తమునకు నాలుగు ధర్మవైద్యశాలలుగలవు. ఈ వైద్యశాలలు ప్రతి సంవత్సరమునను ప్రత్యేకము దాదాపు నలువదివేల (40000) మంది రోగులకు చికిత్సాసాహాయ్య మొనరించుచున్నవి.

పైన కనబరచిన తిరువళిక్కేణి వైద్యాలయమున దాదాపు నాల్గువందల (400) నుండి ఐదువందల (500) రోగులకు ప్రతిదినంబు నుచితంబుగా చికిత్స జేయుటకును ఇతరవ్యయములును జేర్చి నిర్వహించుటకును మాసమొకటింటికి ఐదువందలు (500) నుండి యారువందల (600) రూపాయలు ఆవశ్యకములని తెలియుచున్నది. పైజెప్పిన మొత్తముసంఖ్యకల రోగు

లకు చికిత్స జేయదగినంత యాంగ్లవైద్యాలయమును అన్నివిధములగు వ్యయములతో పరిపాలింపవలెనన్నచో పైజెప్పిన మొత్తము ఒకప్రధానచికిత్సకుని మాసవేతనమునకై సజాలదు. ఇంక సహాయవైద్యులకును ఔషధములకును పరికరములకును ఎంతద్రవ్యము కావలసియుండునో మహాజనుల కెల్లరకును గోచరము కాగలదు.

—॥ రాజకీయాంగ్లవైద్యసహాయము. ॥—

ఆర్యవైద్యసోదరులారా! ఇంతదనుక చెన్నరాజధానియందు ఆయుర్వేద వైద్యప్రచారముంగూర్చి విన్నవించితిని. ఇంక దొరతనమువారి యాంగ్లవైద్యసహాయమునుగురించి ముచ్చటించెదను. ఆంగ్లవైద్య సహాయమునకై మన దొరతనము వారు వత్సరమునకు దాదాపు ముప్పది (30) లక్షల రూప్యములను వెచ్చించుచున్నారు. ఈరాష్ట్రమునందంతటను జేరి దాదాపున ఆరువందల తొంబదియేడు(697) యాంగ్ల చికిత్సాలయములు గలవు. ఈచికిత్సాలయములు దాదాపుగ ఎనిమిదివందల (800) చికిత్సకులచే నిర్వహింపబడుచున్నవి. దొరతనమువారి కొలువునగల చికిత్సకులుగాక ఉద్యోగములనుండి విరామము నొందినవారును స్వతంత్రవైద్యులుగ నున్నవారును జేరి దాదాపుగ రెండువందల (200) యాంగ్లవైద్య చికిత్సకులు కలరనుకొందుము. మొత్తమున నాంగ్లచికిత్సకులు వెయ్యి (1000) మంది మాత్రమే చెన్నరాజ్యమున కలరని తెలి

యుచున్నది. ఈ రాష్ట్రమునం దంతటను నాల్గుకోట్లు ఇరువదిలక్షల (42000000) ప్రజలున్నారు. పైజెప్పిన వైద్యసంఖ్యను జనసంఖ్యను పంచిపెట్టగా నలువదిరెండువేల (42000) జనులకు ఒక యాంగ్ల చికిత్సకుడు చికిత్సాసాహాయ్య మొనరించుచున్నటుల దెలియుచున్నది. దీనికై దొరతనమువారు వత్సరమున కెన్నిరూప్యములు వెచ్చించుచున్నారో యోజింపుడు. మరియు పైవివరములనుబట్టి యాంగ్ల వైద్యసహాయము బొందదలచిన యొకనికి దాదాపు 7 ఏడు అణాలును, ఆయుర్వేద చికిత్సాసహాయము నొందదలచిన యొకనికి దాదాపు ఎనిమిది పైసలును ఖర్చగుచున్నట్లు తెలియుచున్నది. దీనిని బరికించిన మనయాయుర్వేద వైద్యసహాయమెంత సులభమైనదియు ఎంత స్వల్పద్రవ్యసహాయసాధ్యమైనదియు మహాజనులకెల్ల విశదము కాగలదు. పైగనుపరచబడిన సంఖ్యలు దొరతనమువారి 1915-వ వత్సరపు నివేదికనుండి తెలియుచున్నవి.

భారతదేశమునందంతటను ప్రతివత్సరమును దాదాపు ముప్పదియేడు(37)మిలియన్సు మూడుకోట్లు ముప్పదియేడులక్షలు (33700000) ఔట్ డోర్ పేషంట్సు (ఔషధశాలకువచ్చి యౌషధముల గైకొను రోగులు) చికిత్సాసహాయమును బొందుచున్నారు. అందు మదరాసు రాజ్యమునమాత్రము ఏడు మిలియన్సు అనగా డెబ్బదిలక్షలు (7000000) రోగులు చికిత్సాసహాయమును బొందినారు. మొత్తమున ఔట్ డోర్ పేషంట్సు

హిందూదేశమున తక్కిన భాగములకన్న చెన్నరాజ్యమున నెక్కువమంది చికిత్స నొందియున్నారని భారత సామ్రాజ్యము వారి 1913 సంవత్సరపు నివేదికనుండి తెలియుచున్నది. దీనిని బరికించినచో మా చెన్నరాజ్యమునందలి ప్రజలకునుగల దేశభక్తియు దేశీయ వైద్యమునంగల ప్రీతియు సారాసార వివేచకదక్షులగు సభాసదులకెల్ల విశదముకాగలదు. మరియు ఆయుర్వేదవైద్యము ఈ దక్షిణాపథమున నంతగ వెనుకబడియున్నదియు తమకు విదితముకాగలదు.

—ఆయుర్వేదము, రాజకీయసహాయము.—

ఈ రాజ్యమునందాయుర్వేదవైద్యమునకుగూడ దొరతనమువారి సహాయము మునిసిపల్ సంఘములనుండి లభించుచున్నదని చెప్పుటకు సంతోషముగ నున్నదిగాని అట్టిసహాయద్రవ్యముయొక్క పరిమితి యారువంద (600) లనమాత్రము తమరికి జెప్పినచో మీమహాసంతోష సమయమున తమకందరకును మనస్సున భ్రాంతియు విస్మయంబును కలుగకమానదు.

దొరతనమువారిచే నాయుర్వేదవైద్యమునకై యొసంగబడు ద్రవ్య మణుమాత్రమైనను మనప్రియమగు దొరతనమువారిచే నంగీకృతమైనదగుటంజేసి దానినిమహామేరువుగ దలచి శిరసావహించి గ్రహించుచున్నారము.

దొరతనమువారు కొన్నివత్సరములుగ కరుణించియిచ్చు నాయల్పద్రవ్యమునకై యనేకములగు నంతరాయములు

కలుగుచున్నవి. రాజకీయవైద్యశాసన పక్షపాతులగువారు ఆయుర్వేదవైద్యశాలల పోషణమునకు రాజకీయ ధర్మనిధుల నుండియు మునిసిపలు సంఘపు ధర్మనిధులనుండియు నేర్పడిన ధర్మద్రవ్యములచే నేమాత్రమును సహాయము జేయదగదని శాసనమును గావించిరి; కాని ప్రజాపక్షపాతులగు మన ప్రియపరిపాలకులు దాని నిరాకరించి యాసాహాయ్యమును గూడ నొసగించుచునే యున్నారు. అయినను ప్రతివత్సరము నను ఆయవ్యయ విమర్శనసభయందు ఆయుర్వేద వైద్యశాలలకై జేయబడు నీయణుమాత్ర సహాయముకూడ కూడదని మూలచ్ఛేదనమునకే ప్రతిపక్షులు ప్రయత్నించుచుందురు కాని యింతవరకును భగవంతుడగు ధన్వంతరియొక్క ప్రభావబలమునంజేసి వారియుద్యమములు కొనసాగజాలకున్నయవి. ఇక మున్నెట్లు కాగల్గనున్నదో తెలియజాలను.

దక్షిణభారతము, ఆయుర్వేదవైద్యవాఙ్మయము.

ఇంతవరకును దక్షిణభారతమున నాయాభాగముల యందు చిరకాలమునుండియు నభివృద్ధింగాంచిన యాయుర్వేద వైద్యమును వివరింపుచు ప్రస్తావానుసారముగ నచ్చటచ్చట ప్రచారమునందుండు వైద్యవాఙ్మయమునుగూడ సూచించితిని. ఇంక దక్షిణభారత సామాన్యమునంగల యాయుర్వేద వాఙ్మయమునుగూర్చి సవిమర్శముగ వివరించెద.

సంహితలు.

చరకము సుశ్రుతము వాగ్భటము మున్నగు వైదికగ్రన్థములకును, రసరత్నాకరము రసరత్న సముచ్చయము మొద

లగు తాన్త్రికగ్రన్థములకును ఉత్తరభారతమున ప్రచారము గల్గియున్నట్లులు ఈదక్షిణాభారతమునగూడ ప్రచారముగలదు. ఇవిగాక ఉత్తరభారతమున ప్రచారమున లేనివియు మిక్కిలి ప్రాచీనములునునగు భేడసంహిత కాశ్యపసంహితలు ఇప్పటికిని తంజావూరు సరస్వతీపుస్తక భాండాగారమునమాత్రము కలవనునది యీదక్షిణాపథమునకు గౌరవాతిశయమును గల్గించుచున్నది. వీరిమతములనుండు చికిత్సాప్రచారముకూడ నీభాగమున నధికముగ నున్నయది. మరియు క్షారపాణిసంహిత జాతూకర్ణసంహితలును గలవు. నేనీగ్రన్థములకై మిక్కిలి ప్రయత్నము జేయుచున్నాడను. నాప్రయత్నము త్వరలో సఫలంబగునని తలచెదను. మరియు భారద్వాజసంహితయు ఆత్రేయసంహితయు గలవు. ఇందలి కల్పస్థానమునకు జేరిన భేషజకల్పభాగములు లభ్యములు. వీనికి గొన్ని ప్రాచీనములగు వ్యాఖ్యలును గలవు. విపులపరిభాషాబోధకములగు నిట్టిగ్రంథములు ఉత్తరభారతమున దుర్లభములనుటకు గడచిన యేబదివత్సరములకు పూర్వము శ్రీగంగాధరకవిరాజ విరచితమగు వైద్యకపరిభాషయే నిదర్శనము.

— సూత్రగ్రన్థములు. —

సూత్రరూపములగు గొన్నిగ్రంథములు కలవు. అందు ఆయుర్వేదసూత్రము లనునది పదునేడు (17) ప్రశ్నముల గూడియున్నది. ఈగ్రన్థమును పరిశీలించిచూడ నింక కొంతభాగము

న్నట్లు శోధమునున్నది. దీనికి అయిదధ్యాయములవరకు నిత్యానందనసాథవిరచితమగు వ్యాఖ్య లభ్యముగనున్నది. ఇయ్యది పూర్ణముగ దొరకుటలేదు. మరియు ఈసూత్రములకు నగస్త్యవిరచితభాష్యముకూడ కలదని ప్రతీతిమాత్రము కలదు. అయ్యది నాకు లభింపకుండుటంజేసి దానింగూర్చి విమర్శింపజాలను. ఇట్టి సూత్రాత్మకములగు గ్రంథములలో రుగ్ఘృదయము, రుగ్విలాసము, రుగ్ఘృదయసారము మొదలగునవియు కొన్ని గలవు. సంపూర్ణములగువానియానుపూర్వి నాకు దొరకకున్నది. మరియు ఈనిరచనాకాలమును గ్రంథకర్తలనామములును దెలియుట దుర్ఘటముగనున్నయది. ప్రియవైద్యసోదర్యులకు సూత్రవైఖరి వివరించుటకై కొన్ని సూత్రముల జెప్పెద.— "అథాతోధాతుస్థదోషగత్యవికారద్రవ్యాణ్యుద్వ్యాత్, 'అమంహినసర్వరోగాణాం, 'అనామపాలనంకార్యమ్" ఇవి మున్నగు సూత్రరూపములుగ వైద్యగ్రంథము లున్నవి. ఇట్టి సూత్రరూప గ్రంథములు దక్షిణభారతమునదప్ప నితరభాగమున వెదకినను ఇంతదనుక గన్పించకున్నయవి

— వ్యాఖ్యలు. —

చరకసుశ్రుతములకు వ్యాఖ్యరచన యీదేశమున నున్నట్లు తెలియలేదు. వాగ్భటము సింధుదేశమున జనించిన దైనను దానికి కేరళమున ప్రచార మధికముగనున్నది. దీనికి ముద్రితములగు అరుణదత్త హేమాద్రివిరచిత వ్యాఖ్యలుగాక

విజ్ఞానేశ్వరమును, గంగాధర మాధవ విరచిత వ్యాఖ్యలును, హృదయప్రియయను వ్యాఖ్యయును జేరి నాల్గువ్యాఖ్యానము లీదక్షిణాపథమున విరచితములు లభ్యములు. అష్టాఙ్గసఙ్గ్రహమునకును "ఇందు టీక" యను చక్కని వ్యాఖ్యానమునుకలదు. మరియు వాగ్భటమునకు సౌరవిద్యాధర విఠల పణ్డితవిరచితములగు ఖండనమండనగ్రన్థములు రెండుగలవు.

—రసతన్త్రములు.—

రసతన్త్రమునకు జేరిన సారస్వతముగూడ నీప్రాన్తమున ననేకగ్రంథరూపముల దాల్చియున్నది. అందు కొన్నిటిని దమకు సవిమర్శముగ నివేదించెద.

ఆనన్దకన్దము, లేక రసానన్దకన్దము:—ఇత్యాది త్రయోదశభైరవులలో జేరిన మన్థానభైరవునిచే విరచితము.

శివతత్వరత్నాకరము:—ఇత్యాది కేళదిబసవరాజ విరచితము. ఇందు రసతన్త్రమునగల విభాగములన్నియు గలవు. సిద్ధములైనయౌషధముల బరీక్షించునుపాయములు విశేషముగ గలవు. ఇట్టి పరీక్షావిధానములజూపిన మహాశయులలో నితడే మొదటివాడై యుండునాయనియు దోచుచున్నది. "బృహతీకుసుమాకారం లఘు వారితరం గురు । ఘృష్టో రక్తవర్ణం స్యాత్ తస్మ్యెగాఙ్కస్య లక్షణమ్ । అతసీపుష్పసఙ్కాశః భూపతిర్లఘుమానకః॥" ఇవి మున్నగు శ్లోకములచే ఘృష్టగ

తోలన తాపన స్వేదన స్పర్శన దర్శనాదులచే బరీక్షించుక్రమ
మును నిరూపించియున్నాఁడు.

రసప్రదీపిక:—ఇయ్యది జగన్నాథసూరిపుత్రుఁడగు మం
గళగిరిసూరివిరచితము. వ్యాఖ్యానసహితము. ఇవిగాక రససిద్ధా
న్తానుశాసనము రససిద్ధిమున్నగు రసతన్త్రబోధకములగు గ్రన్థ
ములు కొన్ని ప్రసిద్ధములుగ నున్నవి.

—॥ సంగ్రహగ్రన్థములు. ॥—

ప్రసిద్ధములగు ననేకగ్రన్థములనుండి యనేకవిషయముల
సంగ్రహించి కూర్పఁబడిన గ్రన్థములు కొన్ని గలవు

అగినా సగిహితసంహిత:—ఇయ్యది. శ్రీనాథపణ్డిత విరచి
తము. ఇందు శల్య శాలాక్యాద్యష్టాఙ్గములు విపులముగ వివరింప
బడియున్నవి. మఱియు కౌమారభృత్యమును ప్రధానముగఁజేసి
తొలుత పినకించి హేతులక్షణచికిత్సల మూఁడిటిని విపులముగ
నిరూపించియున్నది. ఇయ్యది యష్టాంగబోధక గ్రన్థములలో
నుత్తమమైనది.

బృహద్యోగతరంగిణి:—ఇయ్యది త్రిమల్ల విరచితము.
ఇతఁడు తెనుగునియోగిభూసురుఁడు. కృష్ణామండలమునందలి
కొండపల్లి యనుగ్రామము వీరిజన్మస్థానము. ఇయ్యది స్వతంత్ర
విరచితమగు చక్కని చికిత్సాగ్రన్థము.

యోగతరఙ్గిణి:—ఇయ్యది సింగనభట్టపౌత్రుఁడును వల్లభ
భట్టపుత్రుఁడునునగు త్రిమల్లభట్టునిచే విరచితము. ఇతఁడు ఆన్ధ్ర
బ్రాహ్మణుఁడు. 1731 ఎ. డి. కైస్తవశక కాలమునాటివారని

తెలియుచున్నది. ఇందును వైద్యగ్రన్థమునవలెనే చక్కని చికిత్సా యోగములుగలవు.

యోగరత్నావళి :— పరమశైవాచార్య శ్రీకంఠపండిత విరచితము. వీరలు ఆంధ్రశైవబ్రాహ్మణులు. 1790 వ క్రీస్తు శకమునాటివారు. ఇందు చక్కని చికిత్సాయోగములుగలవు.

హితోపదేశము:— శ్రీకణ్ఠశివపండితవిరచితము. వీరును ఆన్ధ్రశైవబ్రాహ్మణులు. ఇందలి చికిత్సలు మిక్కిలి యాదరణీయములు.

ఇవిగాక భేషజసర్వస్వము, ధన్వన్తరివిలాసము, యోగశతకము, ధన్వన్తరిసారనిధి, సన్నిపాతచన్ద్రిక, రాజమృగాఙ్కము, ప్రశ్నోత్తరరత్నమాల, పిగాభట్టీయము, గదాసఞ్జీవని, ఉమామహేశ్వరసంవాదము, చిన్తామణి, బసవరాజీయము, ఇవి మొన్నగు ననేకగ్రన్థములు చికిత్సాంశముల మిక్కిలి కొనియాడదగినవి కలవు.

— నాడీగ్రన్థములు. —

నాడీవిజ్ఞాననిర్ణయము, షడ్విధనాడీశాస్త్రము, నాడీనక్షత్రమాల, నాడీజ్ఞానము, మొదలగు గ్రన్థములు నాడీపరిజ్ఞానబోధకములు కలవు.

— నిదానగ్రన్థములు. —

శ్రీకణ్ఠనిదానము :— ఇది శ్రీకణ్ఠపణ్డితవిరచితము. దీనికి జీవరక్షామృతమనియు పేరుకలదు. ఇయ్యది మాధవనిదానము

వంటిది. ఇందు రోగులను ప్రశ్నాదిపరీక్షలచే రోగపరిజ్ఞానమార్గముల దెలిపి పిమ్మట నానారోగముల నిదానలక్షణములను వివరముగ నిరూపించియున్నది. జ్వరసన్నిపాతాది నిదానములను మాధవనిదానమునకన్న విపులముగ దెలిపియున్నారు. సకలరోగ పరిజ్ఞానోపాయములు విలక్షణములుగ గలవు. దీనికి బంగాళవ్యాఖ్యను నిదానాగ్నిభాష్యమును తెనుగున చక్కని వ్యాఖ్య రచించియున్నారు. దక్షిణదేశమున నియ్యది ప్రసిద్ధమగు నిదానగ్రంథము. దీనియందు దాక్షిణాత్యులకు నిరుపమానమగు ప్రీతి కలదు.

నిదానప్రదీపము:—ఇయ్యది నాగనాథ విరచితము. ఇవిమున్నగు నిదానగ్రంథములు కొన్ని ప్రసిద్ధములుగ కలవు.

—{ నిఘంటుగ్రంథములు. }—

ధాన్యగణము:—దీనిని రచియించినవారి పేరు తెలియ సాధ్యముగాకున్నది. అయినను ఇందలి విషయములనుబట్టి యాంధ్రదేశపు వైద్యవరునిచే రచియింపబడినదియని యూహింపదగియున్నది. ఇయ్యది పదార్థగుణములబోధించుటలో నత్యుత్తమముగనున్నది. ఇందు ప్రతిపదార్థముయొక్కయు పంచాంగముల (ఆకులు పుష్పములు కాయలు చెక్క వేరు) ననుసరించి గుణముల వేర్వేరుగ జెప్పియున్నారు. ఆంధ్రదేశమున ప్రసిద్ధములగు మూలికలగూడ చేర్చి విశేషముగ జెప్పియున్నారు.

అభిధానరత్నమాల:—దీనికి షడ్రసనిఘంటు వనియు పేరుకలదు. ఇందు మధురాదిరసముల భేదములను బట్టి పదార్థ

విభాగమును జేసియున్నాడు. దీనికి చక్కని సంస్కృతవ్యాఖ్య కలదు. మరియు ద్రవ్యగుణ రత్నావళి, ద్రవ్యగుణ కల్పవల్లి, ఆయుర్వేదమహోదధి (శ్రీసుకవి రచితము), పదార్థచన్ద్రిక, అభిధాన చూడామణి, ద్రవ్యగుణ శతశ్లోకి, అష్టాంగహృదయ నిఘంటువు మున్నగు గ్రన్థములు నిక్కడి ప్రసిద్ధిజెందియున్నవి. ఈ గ్రన్థములయందు ఈ దేశమున విశేషముగ నలవాటులో నున్న "కుండలి" మున్నగు ననేకద్రవ్యముల నిరూపించి యున్నాడు.

—* శ్రీవీరచోళ ఆతురాలయశాసనము.—

(1062—1067—A. D.)

విద్వద్వైద్యబృందమా! ఇంతవరకును దక్షిణభారతము నందాయుర్వేదప్రచారమును వాఙ్మయము చికిత్సావిద్య మున్నగువాని వ్యాప్తిచే తమకు నివేదించినాడ. దక్షిణాపథమున నాయుర్వేదాభివృద్ధిని కోరిన కొందరు ప్రాచీనరాజవరులు ఆయుర్వేదమునకు సంబంధించిన కొన్ని నిబంధనల నలకొల్పి అట్టి యేర్పాటు జేయబడిన ధర్మములు నిరపాయముగ చిరకాలము జరుగుటకై కొన్ని శాసనముల నేర్పరచిరి. అందు నాయుపన్యాసమునకు సంబంధించిన కొన్ని విషయముల సూక్ష్మముగ దెలిపి యుపన్యాసమును పూర్తిగావించెద.

దక్షిణభారతమున ప్రకృతము నాకు లభ్యములైన ప్రసిద్ధములుగనుండు ఆయుర్వేద వైద్య సంబంధ శాసనములలో చంగల్

* దీనివివరములను మాచే వ్రాయబడిన ఆయుర్వేదీయశాసనములు అను పుస్తకమున జూడనగును.

పట్టుజిల్లా మధురాంతకము తాలూకాకు జేరిన తిరుముకూడల్ గ్రామమున శ్రీవీరచోళమహారాజుచే నెలకొల్పబడిన శాసనము నొకటి కనుగొనబడియున్నది. ఈశాసనము చోళదేశాధిపతి యగు రాజకేసరి వీరరాజేన్ద్ర దేవు అను ప్రభువుచే తనకు పట్టాభిషేకమైనపిదప నైదుసంవత్సరములకు పిమ్మట (1067) వ క్రైస్తవ శకవత్సరమున తాజేసిన ధర్మనిబంధనలు శాశ్వతములుగ జరుగుటకై యేర్పరుపబడినది. ఇయ్యది పైజెప్పిన గ్రామమునంగల శ్రీవేంకటేశ్వర దేవాలయము గర్భగృహముయొక్క గోడలయందుగల రాతిబండలపై వ్రాయబడినది. ఈశాసనమున శ్రీవేంకటేశ్వరులకు నిత్యోత్సవాది కైంకర్యములకును వేదశాస్త్రముల బోధించు నొకపాఠశాలకును పాఠములజెప్పు నుపాధ్యాయులకును పోషణమునకై కావలసిన నిబంధనముల వ్రాసి తదనుబంధముగ నచ్చట జదువు విద్యార్థుల యారోగ్య సంరక్షణమునకై యుత్తమమగు నొక యాతురాలయమును జరుపుమనెడి వివరము వ్రాయబడియున్నది. అట్టి యాతురాలయమునుగూర్చి పై శాసనమున నియమించిన పద్ధతులనిట సంగ్రహముగ జూపెదను.—

"ఈ యాతురాలయము "శ్రీవీరచోళాతురాలయము" అను పేర ప్రసిద్ధినొంది యుండవలెను. ఇందు పదునైదుగురు రోగులు నివసించియుండుటకు కావలసినవసతిని కల్పింపనగును. ఇందు ఒక కాయచికిత్సకుడును, ఒక శల్యచికిత్సకుడును, ఇద్దరు

పరిచారకపురుషులును, ఇద్దఱు పరిచారకస్త్రీలును, ఒకసేవకపురుషుడును, ఒక ద్వారపాలకుడును ఉండవలయును. వీరు వారివారికి దగినపనుల జేయుచుండవలెను" అని వ్రాసి పైజెప్పినవారి కియ్యదగిన వేతనము, వారు చేయవలసిన కృత్యములు మొదలగు నిబంధనల దెలుపుపట్టికయు నిట్లు వ్రాయబడియున్నది.

కాయచికిత్సకుడు—పరంపరాగతమైన వైద్యబాధ్యతగలవాడును ఆలపాకనివాసియు సవర్ణగోత్రోద్భవుడునైన "కోదండ రామాశ్వత్థామభట్టర్" అనువాడు కాయచికిత్సకుడుగ నియమింపబడెను. వీరికి ప్రతిదినంబును మూడుకురుణీలబియ్యమును ఎనిమిది కాసులు రొక్కంబును వేతనముగ నియమింపబడినది.

శల్యచికిత్సకుడు :—వీరి నామధేయము నుదహరించక ఏకవచనమున "శల్యక్రియనొనర్చువాడు" అని వ్రాసియున్నది. వీరికి దినమొకటింటికి నొకకురుణివడ్లుమాత్రము వేతనము నియమింపబడినది.

పరిచారకులు :—మందులకు గావలసిన మూలికలు మొదలగు ద్రవ్యముల దెచ్చుటకును ఔషధముల పక్వము చేయుటకు కావలసిన కట్టెలు మున్నగువాని దెచ్చుటకును మందుల జేయుటకును సమర్థులగు పరిచారకు లిద్దరుండవలెను. వీరికి ప్రత్యేకము దినమొకటికి ఒకకురుణివడ్లును ఒకకాసు రొక్కమును వేతనము.

ప్రత్యేకపరిచారకుడు:— రోగులకు సామాన్యోపచారములు చేయుటకు ప్రత్యేకముగ నొకపరిచారకుడు నియమింపబడెను. వీని కొఱకు నాళిపరిమితమగు ధాన్యము వేతనము.

స్త్రీపరిచారికలు:— వీరు రోగులకు నియమితకాలమున మందులనిచ్చి పథ్యముల యథోచితముగజూచుచు నాహారాదులనిచ్చి తత్తత్కాలోచితములగు నుపచారముల నలుపుచుండవలెను. వీరి కిరువురకును జేరి ప్రతిదినంబును నాల్గునాళులు వడ్లును ఒకకాసు రొక్కంబును నియమింపబడినది.

చాకలి, కుమ్మరి:— రోగులబట్టల నుతుకుటకు చాకలి యొకడును, ఆతురాలయమునకావశ్యకములగు కుండలనిచ్చుటకై యొకకుమ్మరివాడును నియమింపబడిరి.

ద్వారపాలకుడు:— వాకిట కావలివాడొకడు కలడు. వీనికి ప్రతిదినము నాల్గునాళులు వడ్లును ఒకకాసును నియమింపబడినది.

మరియు రోగులయుపయోగమునకై యేడుచాపలును, రాత్రులయందు దీపము వెలుగుటకై వత్సరమునకు నలువదియైదు (45) నాళుల పరిమితమగు తైలంబును నిర్ణయింపబడినది.

మరియు నీయాతురాలయమున చికిత్సకై సిద్ధపరచి యుంచబడిన బ్రాహ్మరసాయనము, వాశాహరీతకి, దశమూల హరీతకి, ఉత్తమకర్ణాదితైలము, బలాకోరండకాదితైలము, లశునాద్యేరండతైలము, బిల్వాదిఘృతము, మండూరవటిక,

ద్రవవర్తి, సునేత్రావర్తి, కల్యాణలవణము మున్నగు నిరువది యొక ఔషధములపట్టికయు వానిపరిమితిభేదంబులును నీశాసనమున వ్రాయబడియున్నవి. ఇందలివిషయముల నెల్ల విశదముగ వివరింప నవకాశము చాలదుగాన నింతట విరమించెదను.

ఈశాసనము చెన్నపురీ రాజకీయప్రాచీన వస్తుపరిశోధక సహాయశాఖాధికారియు నాప్రియమిత్రులునగు. రావు సాహేబ్ హెచ్. కృష్ణశాస్త్రిలు బి. ఏ., గారిచే జి. ఓ. నెంబర్. **99-29** ఆగస్టు **1916** - దినమున ప్రచురించిన గౌర్నమెంటు హోం డిపార్టుమెంటు నివేదికయందు సవిస్తరముగ వివరింపబడియున్నది. అట్టి శాసనమును ఆయుర్వేదవిషయముల గూర్చి విమర్శించుటకై నాకొసగిరి. నాచే విమర్శింపబడిన వివరము రాగల రాజకీయనివేదికయందు ముద్రింపబడును.

మలకాపురశాసనము.

గుంటూరు మండలమునందలి గుంటూరుతాలూకాలో చేరిన మంగళగిరికి ఆరుమైళ్లదూరమునంగల మలకాపురమను గ్రామమున నొకశిలాశాసనము కలదు. ఇయ్యది పదునొకండ (11) వ క్రైస్తవశతాబ్దమునకు మధ్యకాలమున కాకతీయ వంశజుడగు గణపతిదేవుని కాలమున జేయబడిన దానధర్మముల నిర్ణయమును దెలుపుటకై యేర్పరుపబడినది. ఈశాసనమునందు ఆగ్రామమున ప్రతివారికిని విద్యార్థులకును విద్యాలయములకును పోషణముకొఱకు ప్రత్యేకమున నియ్యబడిన

భూములవివరము వ్రాయబడియున్నది. మరియు నిందు "ప్రసూత్యారోగ్యశాలాభ్యాం" "పశ్చిమాభ్యాక్ష్మార్యోనైద్యః" "ప్రత్యేకంపుట్టి కాద్వయమ్" ఇవి మున్నగు వాక్యములచేత ప్రసూత్యారోగ్యశాలలను పోషించుటకును వైద్యుని పోషణమునకును ప్రత్యేకముగ రెండేసిపుట్ల (రెండుపుట్ల విత్తనములచల్లి పైరుచేయుదగినంత విస్తీర్ణముగల (40)నలువది యెకరముల) భూమినిచ్చినట్లు చెప్పబడినది. ఇయ్యది అస్మత్ప్రియమిత్రులును ఆంధ్రసాహిత్య పరిషత్సభాపతియునగు శ్రీజయంతి రామయ్యపంతులుగారు బి.యే. బి.యెల్., వారిచేనాకు లభించినది. ఇయ్యది ప్రకృతము భారతసమువారి ప్రాచీన వస్తుపరిశోధక శాఖాలయమున (Epigraphy Office) శ్రీకృష్ణశాస్త్రిగారిచే విమర్శింపబడుచున్నది. దీని కాలమునుగూర్చి యింకయు విమర్శింపబడుచున్నది.

—। నందలూరుశాసనము. ।—

ఈ పేరుగల శాసనము కడపజిల్లాలో నందలూరుగ్రామమునందుగల సౌమ్యనాథస్వామి దేవాలయమున ప్రాకారపు రాళ్లమీద చెక్కబడియున్నది. ఇనుబోలు గ్రామవాసులగు వెలుమలు సాంక్రామిక వ్యాధులలో జేరిన మహామారీజ్వరమను క్రూరవ్యాధిచే భీతులై పెరుంగండూరను గ్రామమున గుడిసెలవేసుకొని యుండిరని యీశాసనముచే దెలియుచున్నది. ఇయ్యది చోళరాజులలో జేరిన కులోత్తుంగచోళుని కాలమున

(1191-వ క్రైస్తవశకవత్సరమున) నేర్పరుపఁబడినది. దీని వివరమంతయు దొరతనమువారి 1908 వత్సరపు ప్రాచీనవస్తు పరిశోధకశాఖవారి నివేదికయందు 84-85 పేజీలలో గానగును. దీనినుండి ప్లేగుజ్వరము చిరకాలమునుండి యీదేశమున కలదనియు దానిబాధకై యారోగ్యరక్షణ మవసరమనియు "హితం జనపదానాం చ శివానామనుసేవనమ్" అను చరకోక్తిప్రకారము ఆరోగ్యసంరక్షణమునకై యట్టిప్రదేశములవదలి యారోగ్యప్రదేశముల నుండిరనియు దెలియుచున్నది.

—౹ అక్కలపూడిశాసనము. ౹—

గోదావరిజిల్లాలోచేరిన రాజమహేన్ద్రవరమునకు సమీపమునందు కొరుకొండకు రాజుగానుండిన శ్రీరాజా ముమ్మడి నాయకులు 1290-వ శాలివాహనశకమునకు సరియగు 1368-వ క్రైస్తవాబ్దమున వారియాస్థానమున విద్వత్వైద్యుడును మన్త్రిసమానుడును కాళనాథభట్టవంశజుడునునగు వైద్యవరునకు అక్కలపూడియను గ్రామమును దానముసంగినట్లు ఒక శాసనముకలదు. ఈ శాసనము ప్రకృతము దొరతనమువారిచే ఎపిగ్రాఫియా ఇండికాయందు ముద్రింపఁబడుచున్నది.

—౹ కలశచేరుశాసనము. ౹—

1345 శకాబ్దమునకుఁ సరియైన 1423 క్రైస్తవశకవత్సరమున కాళనాథభట్ట పుత్రుడగు పరహితాచార్యులను వైద్యునకు గోదావరిజిల్లాలోచేరిన అన్నవరమను నామాన్తరముకల

కలవచేగు గ్రామమును దత్తముచేసి లిఖించిన తామ్రశాసన మొకటికలదు. ఈవైద్యవంశమును పై యాకొల్లాపూడి శాసనము సంబెప్పిన పరహితాచార్యులకు మూడవతరమువాడని తెలియుచున్నది. ఈవంశమునకు జేరిన మూలపురుషులలో నొకడొక సమయమున నొకసర్పము దవడల రెండిటిసంధియందు ఎముక గ్రుచ్చుకొని బాధపడుచుండుటజూచి యాయెముక నూడబెరికి పుండునుమాన్పి యాసర్పమునకు హితమును జేసెను. దానం జేసి నాటనుండియు వానికి పరహితుడనుసార్థకముగ నామము కలిగి యాసర్పమువలన నభయమొంది చికిత్స జేయందొడంగ నాటంగోలె యాతనివంశమున సర్పచికిత్స వాడుకలోనుండె ననియు ఇదిమున్నగు విషయములు పై శాసనముచే దెలియుచున్నవి. మఱియు పై రెండుశాసనములయందును గనుపరుచబడిన పరహిత పరంపరాగత వైద్యులు సర్వతంత్రస్వతన్త్రులనియు వైద్యవిద్యా నిపుణులనియు సర్పచికిత్సకులనియు పై శాసనమున బోధించియున్నది. ఈ పరంపరలో జేరిన యాంధ్రదేశ వైద్యశిఖామణులు వైద్యవాఙ్మయమును రచించినదియు లేనిదియు నీశాసనముచే దెలియ సాధ్యముగాకున్నది. ఈశాసన వివరమంతయు శ్రీజయంతి రామయ్యపంతులుగారిచే నాంధ్ర సాహిత్యపరిషత్పత్రికయందు వివరింపబడినది. దీనివలన నాంధ్ర దేశమున విద్వద్వైద్యులు పెక్కండ్రు కలరనియు విషచికిత్సకులును సర్పచికిత్సకులును ఆకాలమున నుండిరనియు దెలియుచున్నది.

పై శాసనముల నన్నిటిని పరిశీలించుటచే నస్మద్దేశీయు లగు రాజులు చిరకాలమునుండియు ఆతురాలయములను, ప్రసూతిశాలా వైద్యశాలలను నియమించి దానినిర్వహింపం దగిన వైద్యులనియోజించి అయ్యవి శాశ్వతముగ నడచుటకై తగిన మూలధనమును గ్రామాదులను స్థిరముగ నేర్పరిచి యాయుర్వేదమును నానాట వృద్ధినొందింపుచు జనుల కారోగ్యపరిరక్షణ మొనరించుచుండిరనియు స్ఫుటముగ దెలియుచున్నది.

ఆర్యులారా! పూర్వకాలమున మనప్రాచీను లిట్టి యనేకధర్మముల నొనరించియున్నారు. వాని నాయాప్రాంతములనుండు జ్ఞానవంతులు మిక్కిలిశ్రద్ధతో వెదకుచు కనిపెట్టి ప్రచురపరుపవలెను. దొరతనమువారిచే నేర్పాటుచేయబడిన ప్రాచీనవస్త్వన్వేషణ పరిశోధక శాఖవారికి దోడ్పడినచో వారు మిక్కిలి యుత్సాహముతో బరిశీలించెదరు. వీరిసాహాయ్యమున మన ప్రాచీనవైద్యవిద్యా వైభవము వెల్లడికాగలదు. అందలి విషయము లిక్కాలపువారికి మార్గదాయకములును కాగలవు.

ప్రకృతమున కర్తవ్యాంశములు.

సోదరవైద్యబృందమా!

ఇంతదనుక దక్షిణభారతమునందలి యాయుర్వేదప్రచారముంగూర్చి నాకు దెలిసినకొలది తమకు దెలిపితిని. ఇంక

కర్తవ్యాంశములంగూర్చి కొన్నింటిని మాటల జెప్పి నా యుపన్యాసమును ముగించెదను.

కొలది కాలమునుండియు నీ యాయుర్వేదమహామండలి భారతవర్షమున నాయుర్వేదప్రచారముంగూర్చి చేయుకార్యజాతమంతయు నందరకును విదితమే. మరియు నియ్యది సేతుహిమాచలమధ్యవర్తియగు భారతదేశమునంగల దేశీయవైద్యులనెల్ల నొక్కడఁ జేర్చి యందరికిని నైకమత్యమును కలుగఁజేసి యాయుర్వేదమున నపూర్వమగు నుత్సాహమును గల్గించుచున్నది. దీనిచే ప్రతివత్సరమునను మనమందరము నొక్కడఁ జేరి యనేకములగు నాయుర్వేదీయవిషయములఁజర్చించి చిరంతనంబగు నాయుర్వేదముయొక్క పునరభివృద్ధికిం దగుప్రయత్నముల జేయ మనంబుల సంకల్పించుచున్నారము. మనలో గొందరు దీని యభివృద్ధికై పాటుపడుచు నేయున్నారు. దీనియందభిమానము గలవారు ఆమోదించుచున్నారు. దేశబాంధవులగు హానరబిల్ అసదల్లీఖాన్, హానరబిల్ వి. ఎస్., కృష్ణరావుపంతులు, హానరబిల్ సి. వై. చిన్తామణి, హానరబిల్ పండిత మదనమోహన మాళవ్య మున్నగు దేశబాంధవులు రాజస్థానమున దీనికి ప్రాముఖ్యము గల్గునట్లు ప్రయత్నముల సలుపుచున్నారు. అఖిలభారత రాజకీయ వైద్యశాఖాధికారులగు సర్, పార్డీ, లూకీస్ గారు అమృతవాక్యముల దీని కభయదాన మొసగియున్నారు. సార్వభౌమ ప్రతినిధిగనుండిన లార్డు హార్డింజి

ప్రభువరులు ఢిల్లీ మహాపురమునజరిగిన తిబ్బిఆయుర్వేదకలాశాల శంకుస్థాపన మహోత్సవసమయమున తమకీయాయుర్వేదవిద్య యందుగల యభినివేశమును వెల్లడిజేసిరి. మనపరిపాలకులగు సార్వభౌములు విద్వద్వైద్యవరులకు భావగర్భితంబును అన్వర్థంబునునగు 'వైద్యరత్న' యను బిరుదమొసంగి వారికీవిద్యయందుకల యాదరమును దెలుపుచు నీయాయుర్వేదమును తమ యాస్థానవైద్యముగ గ్రహించిరి.

ఇట్టి యుత్సాహసమయమున నార్షసంతతిలోజేరిన మనమందరును ఐకమత్యమున మహర్షుల జ్ఞానతేజస్సులోగూడిన యష్టాంగాయుర్వేదవైద్యము నింతకన్న నభివృద్ధినందించుటకై వారివారిశక్తికి వంచనజేయక తగినప్రయత్నముల సంపూర్ణముగ జేయుట సహజధర్మము.

మనదేశమునకును మనయాచారములకును మనప్రకృతులకును మిక్కిలి యనుకూలములై మనకు సరియగు శీతోష్ణస్థితులుగల మనభారతదేశమున మనతోబాటు జనించిన యోషధులను శాస్త్రీయపద్ధతుల నతిక్రమించక యథావధరూపము నందించి మనదేశమునంగల గ్రామము లన్నిటియందును చికిత్సోపయోగము జేసి మనచికిత్సావిధానమును దేశమునందంతటను వ్యాపింపజేయ దగుప్రయత్నముల జేయుట మనకు విధియైయున్నది.

సోదరులారా! మన యౌవనశక్తిని వినియోగపరచి దేశీయసోదరులను వృద్ధినొందించుట మనకు ముఖ్యకృత్యము. మనము స్వాతంత్ర్యమునకై చేయు ప్రయత్నములలో మనల నితరు లాశ్రయించునట్లు జేయవలెనుగాని మన మితరుల నాశ్రయించునట్లుండగూడదు.

లోకోక్తి ననుసరించి మనమందరము గూడియున్న యీ మూడుదినముల సంతసమును మనమున మఱువక వారువారును తమతమశక్తికిలోపము సేయక "నహి జీవితదానాద్ధి దానమన్యద్విశిష్యతే" అను వరోక్తి మనంబున స్మరింపుచు సర్వజనసామాన్యముగ సంస్థను గల్పింప మీకందరకును సూచించెద.

న్యాయాధికారధురంధరుడగు మన శ్రీ శ్రీ శ్రీ జార్జి సార్వభౌమునకు ఘోరంబగు నీసంగ్రామమున త్వరలో నన్నివిధముల జయము గల్గుటకై శ్రీమద్ధన్వంతరి ననేకవిధముల ప్రార్థించుచు నుపన్యాసమునుండి విరమించుచున్నాడను.

"భిషజాం సాధువృత్తానాం భద్రమాగమశాలినామ్ ।
అభ్యస్తకర్మణాం భద్రం భద్రం భద్రాభిలాషిణామ్" ॥

ఇతి సర్వం శివమ్.

శ్రీధన్వన్తరయేనమః.

ఆయుర్వేదాశ్రమ గ్రంథమాలయందు
శ్రీమాన్, వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులు,
ఎ. వి. ఎస్., ఎ. ఎం. బి. వారిచే సంప్రదాయానుసారముగ
వ్రాయబడి ముద్రితములై క్రయమునకు సిద్ధముగనున్న

ఆయుర్వేద వైద్యగ్రంథములు.

☞ * శాశ్వత చందాదారులకు మా మాధవనిదానము తప్ప మిగత పుస్తకములు 100-కి 25-రూ॥ తగ్గించి ఇవ్వబడును.

1. మాధవనిదానము - సంస్కృతము. తెలుగాంధ్రవ్యాఖ్యాయుతము. రోగనిదానాదు లందలుపు గొప్పవైద్యగ్రంథము. వెల 3 0 0
2. పథ్యాపథ్యము - సంస్కృతము. విశదమగు తెనుగుతాత్పర్యము వ్రాయబడినది. ప్రతిరోగమునకును హితాహితములగు పథ్యాపథ్యములను తెలుపును. వెల ... 1 0 0
3. ఆయుర్వేదపరిభాష - అనేకగొప్ప ఆయుర్వేద గ్రంథములనుండి సంగ్రహింపబడినది. సంస్కృతమునకు చక్కని తెనుగుటీక. ఆయుర్వేదౌషధముల జేయువారు ముఖ్యముగ నెరుగవలసిన విషయము లనేకము లిందుగలవు. వెల ..., 1 8 0
4. అగస్త్యవైద్యము - దక్షిణదేశపు వైద్యసంప్రదాయములను బోధించు తెనుగు వచనము. వెల 0 4 0
5. ఆయుర్వేదాంగశల్యతంత్రము - ఆయుర్వేదమున శస్త్రచికిత్స యెట్లు గనుగొనినదియు దానినభ్యసించు మార్గములను బోధించు తెనుగువచనము. వెల ... 0 4 0
6. వస్తికర్మము - "పిచికారి" యొక్క స్వరూపమును దానినుపయోగించు విధమును అందుపయోగింపబడు చికిత్సామార్గములును వ్రాయబడియుండు తెనుగు వచనము. వెల 0 4 0
7. అర్కప్రకాశము - ప్రతిమూలికనుండియు "అరకుల" దీయుట మొదలగు విషయములను వానిచే రోగములను కుదుర్చు మార్గములను ఆయుర్వేదపద్ధతి ననుసరించి తెలుపు గొప్పచికిత్సా గ్రంథము. సంస్కృతమునకు విస్తృతమైన యాంధ్రవ్యాఖ్యానము వ్రాయబడి యున్నది. వెల 2 0 0

* ఇంతవరకు ముద్రితములను నికమీద ముద్రింపబడు గ్రంథముల నన్నిటిని గ్రహించువారు శాశ్వతచందాదారులుగ నెన్నబడుదురు.